ఆంధ్రజ్యోతి 5
ANDHRAJYOTHY
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 30 ఆగస్టు 2025

మూడు రోజులపాటు భక్తుల నుంచి పూజలందుకున్న వినాయకులు శుక్రవారం గంగమ్మ ఒడికి చేరారు. మండపాల నుంచి చెరువులు, నదులు, సముద్రం ఇతర జలవనరుల వరకు ప్రతిమలను ఊరేగింపుగా భక్తులు తరలించారు. అంతకుముందు స్వామివారి వద్ద ఉంచిన లడ్డూలను వేలం వేసి, ఉట్టి మహోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత డప్పుల వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల నడుమ యువత రంగులు చల్లుకుంటూ గణపతుల ప్రతిమలను తరలించారు. జలంలో ప్రతిమలను నిమజ్జనం చేసి ఉండ్రాలయ్యకు వీడ్కోలు పలికారు.

- ఆంధ్రజ్యోతి బృందం

గణనాథుడి నిమజ్జనంలో అపశ్రుతి

8 లో..

● బాణసంచా పేలి 10 మంది చిన్నారులకు తీవ్ర గాయాలు



కరెన్సీ నోట్లతో.. సంగం మండలం సిద్దీపురంలో రూ.3లక్షల నోట్లతో బాల విఘ్నేశ్వరుడు

బై బై గణేశా!

● గంగమ్మ చెంతకు చేరిన గణనాథులు ● ఉత్సాహంగా నిమజ్జనం



నెల్లూరు : స్వర్ణాల చెరువులోని గణేశ్ ఘాట్‌లో క్రేన్ సాయంతో వినాయక ప్రతిమ నిమజ్జనం



కావలి రూరల్ : చెన్నాయపాళెం తీరంలో వినాయక ప్రతిమను కడలిలో నిమజ్జనం చేస్తూ..



జ్యోతి ప్రజ్వలన చేసి తెలుగు భాషోత్సవాలను ప్రారంభిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

తెలుగు మహోత్సవం

నెల్లూరు పురమందిరంలో శుక్రవారం ఉదయం తెలుగు భాషోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సేవ తెలుగుభాషా సాహితీ, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకను తొలి రోజు పూర్వ ఉపరాష్ట్రపతి వెంయ్యనాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. అంతకముందు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆయన గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రసారభారతి విశ్రాంత అదనపు డైరెక్టర్ డాక్టర్ రేవూరు అనంతపద్మనాభరావు, ఎస్వీయూ శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితర ముఖ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

- వివరాలు 8లో...

ధాన్యం కొనుగోలు చేయండి సార్!

● కలెక్టరేట్ ఎదుట కౌలురైతు సంఘం ఆందోళన



నెల్లూరు (వైద్యం) : ధాన్యం కొనుగోలు చేయాలంటూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద కౌలు రైతుసంఘం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముత్యాల గురున్నాథం, తుళ్లూరు గోపాల్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కొనుగోలు కేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలన్నారు.

రూ.12లకే కిలో ఉల్లి

● రైతుబజార్లలో అమ్మకాలు
● జిల్లాకు 5 టన్నుల దిగుమతి

6 లో..

ఆ గంటన్నరలో 'ఏం చెప్పింది!

● ఏఎస్పీ సౌజన్య ఎదుట గుట్టు విప్పిన అరుణ
● అందరినీ పంపి ఏకాంతంగా వివరాల సేకరణ
● తనను ఒంటరిదాన్ని చేశారంటూ ఆవేదన?
● నేడు కూడా కొనసాగనున్న విచారణ

కి'లేడి' నిడిగుంట అరుణను రెండవ రోజు శుక్రవారం విచారించిన పోలీస్ అధికారులు కీలక సమాచారం రాబట్టినట్టు తెలిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విచారించిన పోలీసులకు అరుణ కోరిక మేరకు ఏఎస్పీ సౌజన్య ఏకాంతంగా మాట్లాడారు. సుమారు 3.30 గంటల నుంచి 5 గంటల వరకు సాగిన ఈ విచారణలో అనేక అంశాలను ఏఎస్పీ దృష్టికి తెచ్చినట్టు సమాచారం. ఈ గంటన్నర సమయంలో అరుణ పోలీసులకు ఏం చెప్పిందనే అంశమే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

కోవూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీఐ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఏఎస్పీ సౌజన్య, రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, మహిళా సీఐ నాగేశ్వరమ్మ, కోవూరు సీఐ సుధాకర రెడ్డిలు అరుణను విచారించారు. అయితే, విచారణ కొనసాగుతుండగా మధ్యాహనం అరుణ అకస్మాత్తుగా ఓ నిర్ణయం తీసుకున్నారు. తన న్యాయవాది సహా పోలీసు అధికారులంతా వెలుపలకు వెళ్తే ఏకాంతంగా మాట్లాడతానని ఏఎస్పీతో అన్నారు. దీంతో అందరూ వెలుపలకు వచ్చేశారు. ఆ తర్వాత సుమారు ఒకటిన్నర గంటపాటు ఏఎస్పీతో అరుణ మాట్లాడినట్లు తెలిసింది. శ్రీకాంత్‌కు పెరోల్ వ్యవహారం గురించి పూసగుచ్చినట్టు వివరించినట్లు తెలిసింది. తనను ఒంటరిని చేసి తనపై పలువురు కక్ష కట్టి, కుట్రపన్నినట్లు అరుణ కన్నీటి పర్యంతమైందని భావిస్తున్నారు. ఇంకా అనేక నేరాల గురించి ఆమె విపులంగా వివరించినట్లు భావిస్తున్నారు. మొత్తానికి నేరాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని పోలీసు అధికారులు రాబట్టినట్టు విశ్వసనీయ సమాచారం.

ఎమ్మెల్యే వీడియోపై లోతుగా విచారిస్తాం : ఏఎస్పీ

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని హత్య చేస్తే డబ్బే డబ్బు అంటూ నలుగురు యువకులు మాట్లాడినట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియోపై లోతుగా విచారిస్తామని ఏఎస్పీ సౌజన్య అన్నారు. విలేకరులు ఆమెకు వీడియో చూపించి వివరాలు అడగ్గా తానిప్పుడే వీడియో చూస్తున్నాననీ, లోతుగా విచారిస్తామన్నారు. అరుణ కేసు వ్యవహారమై తానేమీ చెప్పలేనని, విచారణ అనంతరం అధికారులు నివేదిక రూపంలో వివరాలు తెలియజేస్తామని అన్నారు. శనివారం కూడా అరుణను విచారించనున్నట్లు తెలిపారు.

● 40 నుంచి 50 ప్రశ్నలు

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలీసు అధికారులు అరుణను సుమారు 40 నుంచి 50 ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. చాలా ప్రశ్నలకు తెలియదని, గుర్తులేదని చెప్పినట్లు తెలుస్తోంది. సాయంత్రం కావడంతో ఆమెను తిరిగి నెల్లూరులోని జిల్లా జైలుకు తరలించారు. అయితే, కస్టడీ విచారణకు తమను మధ్యాహ్నం నుంచి రానివ్వలేదని ఆరోపిస్తూ అరుణ తరపు న్యాయవాది ఎస్ మురళి స్థానిక మేజిస్ట్రేట్ కోర్టులో అప్పటికప్పుడు మెమో దాఖలు చేశారు.

● పోలీసులకూ నో ఎంట్రీ!

అరుణను ప్రశ్నిస్తున్న కోవూరు సీఐ కార్యాలయ ఆవరణలోకి పోలీసులను సైతం రాకుండా ఉన్నతాధికారులు నిషేధించారు. ఎస్ఐ రంగనాథ్ గౌడ్ కూడా సర్కిల్ కార్యాలయం వెలుపలే గంటల తరబడి వేచి ఉన్నారు. కస్టడీ విచారణలో అరుణ చెప్పే విషయాలు వెలుగులోకి రాకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. సర్కిల్ కార్యాలయ పరిసర ప్రాంతంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.



విచారణ కోసం కోవూరు సీఐ కార్యాలయానికి అరుణను తీసుకువస్తున్న పోలీసులు

కంటైనర్ సబ్‌స్టేషన్లు వచ్చేస్తున్నాయ్!

రద్దీ ప్రాంతాలకు ఇక నాణ్యమైన విద్యుత్
రూ. 4.2 కోట్లతో నెల్లూరులో ఏర్పాటు
పనులకు నేడు శంకుస్థాపన

నెల్లూరు (జడ్పీ): తక్కువ స్థలం, రద్దీ ప్రాంతాల్లో కరెంటు సమస్య పరిష్కారానికి కంటైనర్ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. ఎస్పీడీసీఎల్ పరిధిలో ప్రప్రథమంగా తొలి కంటైనర్ సబ్‌స్టేషన్‌ను నెల్లూరులో ఏర్పాటు చేస్తున్నారు. సహజంగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు 10 సెంట్ల స్థలం అవసరం ఉంటుంది. దీంతో నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాలలో స్థల సేకరణ విద్యుత్ శాఖకు తీవ్ర సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో వినూత్నంగా కంటైనర్ సబ్‌స్టేషన్లను కేవలం 4 లేదా 5 సెంట్లలో ఏర్పాటు చేసేలా రూపకల్పన చేశారు. నగరంలోని గాంధీబొమ్మ సమీపంలో ఉన్న స్వతంత్ర పార్కులో రూ.4.2 కోట్లతో సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గాంధీబొమ్మ, పొగతోట, ట్రంకురోడ్డు ప్రాంతాల్లో ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్ ఇతర వాణిజ్య దుకాణాలు ఉండటంతో ఆ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగం అధికంగా ఉంటూ లో వోల్టేజ్ సమస్య తలెత్తుతోంది. దూరంగా ఉన్న సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండటంతో సరఫరాలో అంతరాయం కలుగుతోంది. ఈ సమస్య పరిష్కారానికి కంటైనర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. 12.5 మీటర్ల స్పన్ స్తంభాలు, 11 మీటర్ల పీఎస్‌సీసీ స్తంభాలు, 20 కి.మీ పొడవున 11కేవీ తీగలు, 4పీడర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ కార్యాలయంలోని స్కాడాకు అనుసంధానం చేస్తున్నారు. రిమోట్ ద్వారా సబ్‌స్టేషన్ నిర్వహణ ఉంటుంది. ఈ కంటైనర్ సబ్ స్టేషన్ ద్వారా దాదాపు 5వేల మంది వినియోగదారులకు ఉపయోగం కలగనుంది. కంటైనర్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శనివారం ఉదయం పది గంటలకు మంత్రి నారాయణ శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను ఎస్ఈ విజయన్ పర్యవేక్షిస్తున్నారు.



విజయవాడలో ఏర్పాటు చేసి ఉన్న కంటైనర్ సబ్‌స్టేషన్

ఆదరణ అంతంత మాత్రమే!

● 55 బార్లకు అందిన దరఖాస్తులు 18
● నెల్లూరులో 10, కావలిలో 2, కందుకూరులో 3
● గీతకులాల కోటాలో నెల్లూరులో 2,కావలిలో ఒకటి
● ముగిసిన గడువు, నేడు జడ్పీలో లాటరీ

నెల్లూరు(క్రైం) ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన బార్ల పాలసీకి ఆదరణ అంతంత మాత్రంగానే ఉంది. వ్యాపారుల నుంచి ఆదరణ లేకపోవడంతో ప్రభుత్వం గడువు పెంచింది. అయినా పెద్దగా దరఖాస్తులు రాలేదు. దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం వరకు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో జిల్లాలో 55 బార్లు ఉండగా 18 బార్లకు మాత్రమే దరఖాస్తులు అందాయి. ఇక గీత కులాలకు సంబంధించి జిల్లాలో ఐదు బార్లకు సంబంధించి నెల్లూరులో రెండు బార్లకు మాత్రమే 9 దరఖాస్తులు మాత్రమే అందాయి. కావలి ఒకటి ఉండగా, ఆరు దరఖాస్తులు అందాయి. శనివారం నగరంలోని జడ్పీ కార్యాలయంలో లాటరీ విధానంలో బార్లను కేటాయించనున్నారు.

● దరఖాస్తులు ఇలా..

ప్రభుత్వం జిల్లాలో 50 బార్లకు, గీత కులాలకు 5 బార్లకు (మొత్తం 55) వ్యాపారులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈనెల 26 వరకే బార్లకు దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించినా, వ్యాపారుల నుంచి ఆదరణ రాలేదు. దీంతో ఈనెల 29 వరకు గడువు పొడిగించింది. 30న లాటరీలో బార్లు కేటాయించేలా ఉత్తర్వుల జారీ చేశారు. ఈ క్రమంలో ఈ నెల 29 సాయంత్రం 5 గంటల వరకు నగరంలో 38 బార్లకు సంబంధించి 10 బార్లకు 4 దరఖాస్తులు అందాయి, ఇక కావలిలో ఏడు బార్లకుగానూ రెండు బార్లకు ఎనిమిది దరఖాస్తులు, కందుకూరులో మూడు బార్లకు 12 దరఖాస్తులు అందాయి. ఇక బుచ్చిలో ఒక బారుకు, ఆత్మకూరు, అల్లూరులో ఒక బారుకు దరఖాస్తులు అందలేదు. ఇక గీత కులాలకు సంబంధించి జిల్లాలో 5 బార్లను కేటాయించగా నెల్లూరులోని రెండు బార్లకు తొమ్మిది దరఖాస్తులు, కావలిలో ఒక బారుకు ఆరు దరఖాస్తులు, కందుకూరులో ఒక బారుకు మూడు దరఖాస్తులు, అల్లూరులో ఒక బారుకు ఒక దరఖాస్తు మాత్రమే అందాయి. అయితే ఒక్కో బారుకు నాలుగు దరఖాస్తులు అందాలని, ఒక్కరే నాలుగు దరఖాస్తులు వేయకూడదన్న నిబంధనలు ఉన్నాయి.

● ప్రభుత్వమే తగ్గాలి

బార్లకు సంబధించి ప్రభుత్వం విడుదల చేసిన నూతన పాలసీ ప్రస్తుత బార్ యాజమాన్యాలకు నచ్చలేదు. ఈ క్రమంలో వారు మొదటి నుంచి బార్ పాలసీని వ్యతిరేకిస్తున్నారు. అసలు ఎవరూ దరఖాస్తులు వేయకుంటే ప్రభుత్వమే దిగి వస్తుందని భావించిన బార్ల యాజమాన్యం అసోషియేషన్ నాయకులు దరఖాస్తులు ఎవరూ వేయకూడదని నిబంధన పెట్టుకున్నారు. అయితే కొందరు మాత్రం బార్లకు దరఖాస్తులు దాఖలు చేసేశారు. ప్రస్తుతం బార్లు ఉన్న యాజమాన్యంలో అధికంగా కూటమి ప్రభుత్వానికి చెందిన వారు ఉండటం, వారు ప్రభుత్వ బార్ పాలసీను వ్యతిరేకించడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

నియోజకవర్గాల అభివృద్ధికే 'ఎల్‌ఆర్‌ఎస్' నిధులు

● కొత్త వెంచర్లలో పది శాతం భూమి వదలాల్సిందే!
● వైసీపీ హయాంలో 'నుడా' నిర్వీర్యం
● జరిగిన అక్రమాలపై త్వరలో విజిలెన్స్ విచారణ
● ఎమ్మెల్యేల సమీక్షలో మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), ఆగస్టు 29, (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గాల అభివృద్ధికే 'ఎల్‌ఆర్‌ఎస్' నిధులు ఖర్చు చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగురు నారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం నెల్లూరులోని కార్పొరేషన్ కార్యాలయంలో కలెక్టర్ ఓ ఆనంద్‌తో పాటు నుడా పరిధిలోని నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ జగన్ సర్కారు అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీలను పట్టించుకోలేదని, అందులోని నిధులను చెల్లాచెదురు చేశారని ఆక్షేపించారు. నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) పరిధిలోని విభాగాలన్నిటినీ సర్వనాశనం చేశారని, ఎలాంటి అభివృద్ధి పనులు జరగకుండానే డబ్బులు డ్రా చేసేశారని దుయ్యబట్టారు. దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఎమ్మెల్యేల నుంచి విజ్ఞప్తులు అందుతున్నాయన్నారు. త్వరలోనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఎవరూ నష్టపోకూడదన్న ఉద్దేశంతో ఎల్‌ఆర్‌ఎస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. భవన నిర్మాణాలకు అనేక సులభ పద్ధతుల్లో అనుమతులు ఇస్తున్నామని చెప్పారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆయా స్థానిక నియోజకవర్గాల అభివృద్ధికి ఖర్చు చేయాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నూతన వెంచర్లు ఏర్పాటు చేసే వారు పార్కులు, దేవాలయాలకు 10 శాతం భూమి ఇచ్చితంగా వదలాలని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, ఆర్డీవో అనూష, కమిషనర్ నందన్, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగ నగరంలోని 14వ డివిజన్ వద్ద జగదీష్‌నగర్‌ల అదానీ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటైన పార్కు, ఎన్టీఆర్ సుజల సురక్షిత మంచినీటి పథకాలను మంత్రి ప్రారంభించారు. ఈ ఏడాది చివరి నాటికి నగరంలోని ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు.



నుడా సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, చైర్మన్ కోటంరెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యేలు, అధికారులు

'గండికోట'కు గిడుగు పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బుచ్చినగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ గిడుగు పురస్కారం అందుకున్నారు. తెలుగు వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నెల్లూరు టౌన్ హాలులో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ సభలో గిడుగు సరస్వతి, గణేష్ కార్తీక్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9812
వెండి కిలో ధర	రూ. 120900
వెండి ఒక గ్రాము	రూ. 123.90

బొజ్జ గణపయ్య.. బహు రూపాయ..

గణేశుడికి ప్రత్యేక పూజలు

పొదలకూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు కనుల పండువగా సాగుతున్నాయి. పలు కమిటీల ఆధ్వర్యంలో విభిన్న రూపాల్లో గణనాథుడిని కొలువుదీర్చి ప్రత్యేకత చాటారు. తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఉట్టి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలు రంగులు పులుముకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. విగ్రహాలను డేగపూడి కల్వేటికి, కండలేరు డ్యామ్‌కు నిమజ్జనానికి తరలించారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇందుకూరుపేట : మండలంలోని జగదేవిపేట నల్లలదిబ్బలో చిన్నారులు ఏర్పాటు చేసిన బాల వినాయకుడి విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. మండలంలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో చిన్నారులు భవ్య, లక్కీ, గణ, దేవాన్ష్, విజయ్‌కుమార్ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: మండలంలోని కాగితాలపూరు గ్రామంలో గురువారం రాత్రి వినాయక గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా మెయిన్ సెంటర్‌లో విగ్రహం ఏర్పాటు చేశారు. పూలతో ప్రత్యేకంగా అలంకరించి గజాననుడికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. లడ్డు వేలం పాట నిర్వహించగా రూ.40 వేలకు చిల్లకూరు రమేష్‌రెడ్డి దక్కించుకున్నారు. చెరువులో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక గిరిజాహాల్ సెంటర్‌లో రాజా ఫ్యాన్సీ వీధి, బెజవాడ గోపాల్ రెడ్డి, పార్కు పరిసర ప్రాంతాల్లో గణేశ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని సాల్మానుపురంలో మూడు గణేశ్ సీతాలమ్మ గుడి వీధిలో నెలకొల్పిన వినా యకుడి బొడ్డులోని 5 రూపాయల బిళ్ళకు కమిటీ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. స్థానిక నెల్లూరుకు చెందిన శ్రీలత రూ. 33 వేలకు దక్కించుకోగా, లడ్డును రూ. 27 వేలకు స్వంతం చేసుకున్నారు. అదే గ్రామంలో పాఠశాల దగ్గర నెలకొల్పిన గణేశ్ లడ్డును మల్లు సుబ్బరామిరెడ్డి 32 వేలకు వేలం ద్వారా పాడుకున్నారు.

పొదలకూరు : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆది దంపతుల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. పట్టణంలోని రామ మందిరం వీధిలో శివసాయి యూత్ ఆధ్వర్యంలో అర్చకులు శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి పార్వతీదేవి, పరమేశ్వరుడి మాంగల్యధారణ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తగణంతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ ఉత్సవానికి ఉభయ కర్తలుగా అమర్తలూరు పాపయ్య, కామాక్షి, లక్ష్మి, నవీన్‌కుమార్‌లు వ్యవహరించారు. అనంతరం అన్నదానం చేశారు. శివసాయి యూత్ సభ్యులు వీరేంద్ర, సందీప్, ఓబులేసు, శివ, ప్రదీప్ పాల్గొన్నారు.

రాపూరు: వినాయక విగ్రహాలను ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఘనంగా గణేశ్ ప్రతిమలను నిమజ్జనం చేశారు. సిద్ధలయ్య సెంటర్ మహాగణపతి విగ్రహం వద్ద అన్నదానం నిర్వహించగా, లక్ష్మీపురంలో ఉట్టి మహోత్సవం నిర్వహించారు.



మనుబోలులో గజాననుడి ఊరేగింపు



బుచ్చి: సాల్మానుపురంలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణేశుడు



పశువుల్లో కృత్రిమ గర్భధారణ లాభదాయకం

భూపతి గౌతమ్, పశు వైద్యుడు, దండిగుంట

విడవలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆవులకు కృత్రిమ గర్భధారణ చేయిస్తే పాడి రైతులకు లాభదాయకమని, తద్వారా ముర్ర జాతి పశువులను ఉత్పత్తి చేయవచ్చునని దండిగుంట పశువైద్యాధికారి భూపతి గౌతమ్ తెలిపారు.

?. సెక్స్ సోర్టెడ్ సెమెన్ రైతులకు అందుబాటులో ఉందా.. ఉచితంగా ఇచ్చారా..

!. సెక్స్ సోర్టెడ్ సెమెన్ పాడి రైతులకు అందుబాటులో ఉంది. దాని విలువ ఒక స్ట్రా ఖరీదు రూ.500 ఉండగా ప్రభుత్వం రూ. 150కే రైతులకు అందజేస్తోంది.

?. ఎస్ఎస్ఎస్ సెమన్ ఏఏ జాతుల పశువుల్లో అందుబాటులో ఉంది

!.ప్రస్తుతానికి గేదెల్లో ముర్రాజాతి, ఆవుల్లో హెచ్ఎఫ్ జెర్సీ వీర్యం అందుబాటులో ఉంది.

?. పాల దిగుబడికి ఎలాంటి కార్య క్రమాలు చేపడుతున్నారు

!. బ్లాక్కెట్ సర్వే ద్వారా పాడి పశువుల వివరాలను సేకరించి వాటి దిగుబడిని అంచనా వేస్తున్నాం. దిగుబడి తగ్గిన పశువులకు ప్రత్యేక చికిత్స చేస్తున్నాం.

?. వానాకాలంలో పశువులకు ఎటువంటి వ్యాధులు వస్తాయి

!. వర్షాకాలంలో పెద్ద పశువుల్లో పచ్చిక దొమ్మ, ఎస్ఎస్‌డీ వ్యాధి, జీవాల్లో నట్టల వ్యాధి, నీలి నాలుక వ్యాధులు ప్రబలుతాయి. సకాలంలో పశువులకు రైతులు టీకాలు వేయించాలి.

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాలతోపాటు రాష్ట్ర నలమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మస్తాన్ వలీ దర్గాను సందర్శించారు. షాఫా బావిలో పుణ్య స్నానాలు అచరించి మస్తాన్ స్వామిని దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. మస్తాన్ స్వామి దర్గాను పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. వక్ఫ్ బోర్డు అధికారులు సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

స్మార్ట్ బియ్యం కార్డుల పంపిణీ



రైస్ కార్డు అందిస్తున్న వీఆర్వో

మనుబోలు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలో రెవెన్యూ అధికారులు స్మార్ట్ బియ్యం కార్డులను వేగంగా పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం చంద్రమౌళీనగర్ గిరిజన కాలనీ, శివాలయంవీధి, పడమర వీధిలో ఇంటింటికీ వెళ్ళి రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది కార్డులు అందిస్తు న్నారు. మనుబోలు పంచాయతీలోని 4 చౌక దుకాణాల పరిధిలో 2441 కార్డులు ఉన్నాయి. 25వ తేదీనుంచి మూడు బృందాలు స్మార్ట్ రైస్ కార్డులు అందించి, లబ్ధిదారుల ఫోటో లను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేసు కుంటున్నారు. అర్హులందరికీ స్మార్ట్ బియ్యం కార్డులు అందిస్తామని, సెప్టెంబర్ 1వ నుంచి డీలర్ వద్ద ఉంటాయని వీఆర్‌వో నాగార్జున రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మరో వీఆర్‌వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

సంగం, ఆగస్టు 29 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు డిగ్రీ పట్టాతో కళాశాల నుంచి బయటకు వెళ్లేట ప్పుడు ఉద్యోగం స్వీకరణ కాకుండా పలువురికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని విక్రమ సింహ పురి వైస్ చాన్స్‌లర్ డాక్టర్ అల్లం శ్రీని వాసరావు సూచించారు. శుక్ర వారం ఆయన సంగంలోని నేతాజీ డిగ్రీ కళాశాలలో పీ4లో భాగంగా కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి బాలికలకు ఏర్పాటు చేసిన ఉచిత హాస్టల్ గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ విద్యకు పేదరికం అడ్డుకాదని, కష్ట పడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని తెలిపారు. ప్రస్తుతం యూనివర్సిటీల్లో రకరకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

వరి సాగులో మెలకువలపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆత్మ పీడీ మురళి

ఇందుకూరుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగదేవిపేట రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు వరి సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఐ మురళి హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంట యాజమాన్యంలో మేలైన పద్ధతులు, కొత్త రకాల గురించి వివరించారు. వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న తదితర పంటలు వేసుకుని రైతులు లబ్ధి పొందాలన్నారు. ఆత్మ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వరిలో కొత్త రకాలు, సాగు విధానంలో కొత్త పద్ధతులు రైతాంగానికి పరిచయం చేస్తామన్నారు. సమగ్ర సస్యరక్షణ, ఎరువుల వాడకం, నారుమడి, నీటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. అవసరమైన మేరకు మాత్రమే పురుగు మందులు వాడాలన్నారు. సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి. రఘునాథరెడ్డి, టెక్నికల్ ఏఓ సురేందర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బోర్లు ఇలా... తాగునీరు ఎలా?



బీసీ, ఎస్టీ కాలనీల్లో మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

విడవలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పంచాయతీ అయిన గాదెలదిన్నెలో వేలాది రూపాయలు వెచ్చించి వేసిన తాగునీటి బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. అయినా అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవటంతో చేతి పంపులు శిథిలావస్థకు చేరాయి. దీంతో దళిత, గిరిజన, బీసీ కాలనీల్లోని ప్రజల గొంతెండుతోంది. తాగునీటి కోసం ఇక్కడి ప్రజలు పంచాయతీ కొళాయిలపై ఆధారపడుతున్నారు. విద్యుత్ ఉంటేనే కొళాయిల్లో నీరు వస్తుంది. లేకుంటే తాగునీటికి ఇబ్బందులు తప్పవని స్థానికులు వాపోతున్నారు. వెంటనే చేతి పంపులకు మరమ్మతులు చేయాలని మహిళలు కోరుతున్నారు.

డీఎం కండ్రికలో వైద్య శిబిరం



నీటి ట్యాంకును పరిశీలిస్తున్న వైద్యులు

ఇందుకూరుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని డీఎం కండ్రికలో నిర్వహిస్తున్న 104 వైద్య శిబిరాన్ని శుక్రవారం జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సందర్శించారు. గర్భిణీలు, బాలింతలతో పాటు మంచానికి పరిమి తమైన వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి. కిశోర్ కుమార్, డిప్యూటీ హెచ్‌ఈవో సుధాకర్‌రావు, హెల్త్ అసిస్టెంట్ మాధవ, ఏఎన్ఎం శ్రీకల్పవల్లి, 104 సిబ్బంది లక్ష్మణ్, ఆశ వాలంటీర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు సీఎం సహాయనిధి వరం

చేజర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అనుకోకుండా జరిగిన సంఘటనలు, అనారోగ్య కారణాలతో ప్రైవేటు వైద్యశాలల్లో ఆపరేషన్లు, చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని మండల టిడిపి అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ పేర్కొన్నారు. చేజర్లలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంలో చేజర్ల మండలంలో 14 మందికి రూ.11.10 లక్షల చెక్కులను గురువారం మంత్రి అనం చేతుల మీదగా లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు.

సరైన పత్రాలు ఇస్తేనే నష్ట పరిహారం

భూముల వివరాలపై తహసీల్దారు రమాదేవి ఆరా



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు రమాదేవి

మనుబోలు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): భూములకు సంబంధించిన సరైన పత్రాలు సమర్పిస్తేనే ప్రభుత్వం నుంచీ నష్టపరిహారం అందుతుందని తహసీల్దారు రమాదేవి పేర్కొన్నారు. బద్వేలు నుంచి నెల్లూరు వరకు 67వ జాతీయ రహదారిని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గాను మండలంలోని చెరుకుమూడి రెవెన్యూ పరిధిలో రైతులు పట్టా, ప్రభుత్వ భూములు కోల్పోతున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికలను గతంలోనే ప్రభుత్వానికి పంపారు. అయితే 16 మంది రైతులు సరైన పత్రాలు ఇవ్వకపోవడంతో వాటిపై విచారణ చేయాలని ఉన్నతాధికారులు తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో ఆమె చెరుకుమూడి వెళ్ళి రైతులతో మాట్లాడారు. 16 మంది రైతులకు చెందిన 11.87 ఎకరాల భూమి జాతీయ రహదారికి పోతుందన్నారు. ప్రభుత్వ, పట్టా భూముల వివరాలపై రైతులతో ఆరా తీశారు. కోల్పోయిన భూములకు సంబంధించిన పత్రాలను వీఆర్‌వోకు ఇవ్వాలన్నారు. చెరుకుమూడి రెవెన్యూలోనే రెండు లే అవుట్లు పట్టా భూమిలో ఏర్పాటు చేయగా, రీ సర్వేలో వాటిని ప్రభుత్వ భూమిగా చూపించారని రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ లేఅవుట్లను తహసీల్దార్ పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అరుణ్‌బాబు, వీఆర్‌వో బుజ్జయ్య, సర్వేయర్ అనుదీప్, విలేజ్ సర్వేయర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఏ గ్రేడ్ సాధనే లక్ష్యంగా పంచాయతీల అభివృద్ధి

ఎంపీడీవో నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీవో నారాయణరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బుచ్చి మండలంలో 2023-2024 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీల పురోగతిపై సచివాలయాల పరిధిలోని 17 శాఖల నుంచి 9 ప్రధాన అభివృద్ధి పనులకు సంబంధించి, 164 అంశాలలో ఏ గ్రేడ్ సాధించడమే లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు, సమిష్టి కృషి చేయాలని ఎంపీడీఓ నారాయణ రెడ్డి సూచించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, పురోగతిపై శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ ఆధ్యర్యంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులకు పీఏఐ 2.0 వర్క్‌షాప్ నిర్వహించారు. పంచాయతీలలో 17 శాఖలకు సంబంధించి అభివృద్ధి నివేదికను ఆన్‌లైన్‌ద్వారా ఎంపీడీఓ లాగిన్‌కు పంపించాలన్నారు. ఆ నివేదికను జిల్లా అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తారన్నారు. ఏ గ్రేడ్ సాధనకు అవసరమైన అంశాలపై అవగాహన కల్పించారు. 2022-23కు సంబంధించి గతంలో బీ గ్రేడ్ సాధించినట్లు తెలిపారు. ఈ సారి జిల్లాలో బుచ్చి మండలం నుంచి సమిష్టి కృషితో ఏ గ్రేడ్ సాధించడమే లక్ష్యంగా పనిచేద్దామని ఎంపీడీవో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు

ఉదయగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో శుక్రవారం వివి.ద పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ టీ గోపికృష్ణ బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో ఆటల పోటీలు నిర్వహించామన్నారు.

ఘనంగా తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పొదలకూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డీఎన్ఆర్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ మాట్లాడుతూ హాకీ క్రీడా కారుడు ధ్యాన్ చంద్ స్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులను గొప్ప క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులదేనన్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు దేవిక, పార్వతి పాల్గొన్నారు. అలాగే అమరావతి పాఠశాలలో తెలుగు భాష, క్రీడా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు తెలుగు భాష ఆవశ్యకతను వివరించారు. క్రీడా రంగంలో ధ్యాన్‌చంద్ విజయాలను తెలియజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పద్య పఠనం, వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కె సురేష్, ఉపా ధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రౌడీషీటర్లపై పోలీసుల పంజా

● డీజీపీ ఆదేశాలతో వరుస అరెస్టులు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రౌడీషీటర్లపై పోలీసులు పంజా విసురుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రౌడీషీటర్ల ఆగడాలు జిల్లాలోనే కాదు పొరుగు జిల్లాలోనూ మితిమీరిపోయాయి. ఇదే సమయంలో రౌడీషీటర్ శ్రీకాంత్, కి'లేడి' అరుణ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవడంతో ప్రభుత్వం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే డీజీపీ, గుంటూరు రేంజ్ ఐజీ విడతలవారీగా జిల్లాకు చేరుకుని పోలీస్ అధికారులతో సమీక్షించారు. రౌడీషీటర్ల విషయంలో ఉపేక్షించవద్దని, ఏదైనా తాను చూసుకుంటానని, రాజకీయ నాయకులు సైతం రౌడీషీటర్ల కోసం ఫోన్లు చేయరని డీజీపీ అధికారులకు స్పష్టంగా తెలిపారు. దీంతో ఎస్పీ కృష్ణకాంత్ నేతృత్వంలో జిల్లావ్యాప్తంగా వారం రోజుల్లోనే 40 మంది రౌడీషీటర్లను పలు కేసుల్లో పోలీసులు అరెస్ట్ చేశారు. దర్గామిట్ట పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో ఆరుగురు రౌడీషీటర్లను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్య శుక్రవారం నిందితుల వివరాలను వెల్లడించారు. నెల్లూరు నగరానికి చెందిన వినయ్, బాలమణికంఠ, వెంకటతేజ, ఛత్రపతి, ముర్తియార్‌లు జాబితాలో ఉన్నారు. గతంలో ఓ హత్య కేసులో వీరంతా నిందితులు. వ్యసనాలకు బానిసైన వీరు గంజాయి విక్రేతలుగా మారారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి విక్రయించేందుకు తరలిస్తున్నారని దర్గామిట్ట పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో బారాషాహీద్ దర్గా సమీపంలో నిందితులను అరెస్ట్ చేసి తొమ్మిది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని జైలుకు పంపామని సీఐ తెలిపారు.

రూ. లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు

నెల్లూరు(క్రైం) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఓ వ్యక్తిని నమ్మించి రూ.45.20 లక్షలను సైబర్ నేరగాళ్లు దోచేశారు. ఈ ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, నగరంలోని ఏకేనగర్ పోలీసు కాలనీలో ఓ వ్యక్తి నివాసం ఉంటున్నారు. ఆయన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తుంటారు. ఆయనకు గత జూలై 5న శానికగోఖ్లే అనే వ్యక్తి వాట్సాప్‌లో మెసేజ్ చేశారు. తాను ఓ ప్రొఫెసర్‌కి అసిస్టెంట్‌గా పనిచేస్తున్నానని పరిచయం చేసుకున్నారు. ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే మూడింతలు లాభాలు వస్తాయని నమ్మించాడు. దీంతో ఎనిమిది దఫాలుగా బాధితుడు రూ.45లక్షలు పెట్టారు. అప్పటి నుంచి సైబర్ నేరగాడు ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చేజర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో మండలంలోని కండాపురం గ్రామంలో శుక్రవారం రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం మేరకు.. వినాయక చవితి సందర్భంగా గురువారం మధ్యాహ్నం జరిగిన అన్నదాన కార్యక్రమంలో రెండు కుటుంబాల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. అయితే ఆ సమయంలో అక్కడే ఉన్న గ్రామస్థులు సర్దుబాటు చేసి పంపించేశారు. అయితే శుక్రవారం ఉదయం ఒక కుటుంబానికి చెందిన వ్యక్తి నెల్లూరు నుంచి కొంతమందిని తీసుకురావడంతో గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న చేజర్ల ఎస్ఐ తిరుమలరావు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘర్షణలో దాసరి పవన్, దాసరి జయకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి...

వెంకటాచలం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరులోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన పవన్ కుమార్, సురేష్ ముత్తుకూరు మండలం పంటపాళెం వద్ద ఉన్న ఆయిల్ ఫ్యాక్టరీలో విధులు ముగించుకుని మోటర్ బైకుపై నెల్లూరుకు వస్తుండగా సర్వేపల్లి రైల్వే గేటు వద్ద బైక్‌ను ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఓ ఓ ప్రైవేటు క్లినిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్పంచు చెక్ పవర్ రద్దు

చేజర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు పూర్తి విచారణ అనంతరం చేజర్ల మండలం ఏటూరు గ్రామ పంచాయతీకి చెందిన వైసిపి సర్పంచ్ వై నాగభూషణమ్మకు 6 నెలల పాటు చెక్‌పవర్ రద్దుచేస్తూ జిల్లా పంచాయతీ అధికారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఏటూరు గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రామంలో డివిజనల్ పంచాయతీ అధికారి విచారించి తుది నివేదికను జూలై 28వ తేదీన జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించారు. ఈ నివేదికలో సాధారణ నిధులు రూ.8,73,381, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14,62,938 అభ్యంతరకరమైన రీతిలో ఖర్చు చేయటంతో పాటు 44 వేల రూపాయల నిధులు దుర్వినియోగం చేయడంతో వివరణ కోరుతూ గ్రామ సర్పంచ్‌కి షోకాజు నోటీసును జారీ చేశారు. అయితే సర్పంచ్ ఎటువంటి సంజాయిషీ ఇవ్వకపోవడంతో జిల్లా పంచాయతీ అధికారి సర్పంచ్ వై నాగభూషణమ్మకు 6 నెలల పాటు చెక్‌పవర్ రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.12లకే కిలో ఉల్లి

● రైతుబజార్లలో అమ్మకాలు

● జిల్లాకు 5టన్నుల దిగుమతి



నవాబుపేట రైతుబజారులో ఉల్లిపాయల బస్తాలు

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల కోసం రైతు బజార్లలో కిలో ఉల్లిపాయలు రూ.12లకు విక్రయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు నుంచి శుక్రవారం 5 టన్నుల ఉల్లిపాయలను జిల్లాకు దిగుమతి చేసుకున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత తెలిపారు. కావలి, కందుకూరు రైతుబజార్లకు ఒకటిన్నర టన్నుల చొప్పున, నెల్లూరులోని నవాబుపేట, ఫత్తేఖాన్‌పేట రైతుబజార్లకు టన్ను చొప్పున రెండు టన్నులు కేటాయించారు. కావలి, కందుకూరులలో శుక్రవారం సాయంత్రమే ఉల్లిపాయలు విక్రయించగా, నెల్లూరులో శనివారం నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఏడీ తెలిపారు. పొదలకూరు రైతుబజారుకు మాత్రం మరో విడతలో పంపించే అవకాశం ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 560

అద్దె చెల్లించనందున దుకాణం సీజ్

కార్పొరేషన్‌కు చెందిన సుబేదార్ పేటలోని ఎస్‌సీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఓ వ్యక్తి దుకాణం అద్దెకు తీసుకుని చెల్లింపులు చేయలేదు. దీంతో రెవెన్యూ అధికారులు ఆ దుకాణాన్ని శుక్రవారం సీజ్ చేశారు. 10 నంబరు దుకాణదారుడు 2017 నుంచి రూ. 17.84 లక్షలు అద్దె చెల్లించాల్సి ఉండటంతో అధికారులు నోటీసులు ఇచ్చారు. ఆయన స్పందించకపోవడంతో ఆర్ఐ కిరణ్ నేతృత్వంలోని సచివాలయ సిబ్బంది ఆ షాపును సీజ్ చేశారు.

- నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)



దుకాణం సీజ్ చేసిన రెవెన్యూ ఉద్యోగులు

న్యూస్ బాక్స్

నాటి వైసీపీ కుతంత్రాలు బయటపడుతున్నాయి : సోమిరెడ్డి

నెల్లూరు(క్రైం) ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన రౌడీషీటర్ల ఆగడాలు, కుట్రలు, కుతంత్రాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అప్పట్లో వైసీపీని వీడుతున్నారని, ఏకంగా హత్య చేసేందుకు కుట్ర చేశారంటే రౌడీయిజం ఏ స్థాయికి అప్పటి ప్రభుత్వంలో చేరుకుందో అర్థమవుతుందన్నారు. వరుసగా వెలుగు చూస్తున్న ఘటనలు ప్రశాంతతకు మారు పేరైన నెల్లూరుకు మాయనిమచ్చగా మారాయన్నారు. కరుడుగట్టిన ఈ క్రిమినల్స్‌కు వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు తీసుకోవాల్సి బాధ్యత పోలీసులపై ఉందన్నారు. రౌడీ గ్యాంగ్‌లను కూకటివేళ్లతో సహా పెకలించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. శ్రీధర్‌రెడ్డి హత్యకు కుట్ర జరగడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు.


కేసును దారి మళ్లించవద్దు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : అంధుడినైన తనపై, తన తల్లిపై ఇనపరాడ్లుతో దాడి చేసిన రేణుక అనే మహిళపై తాము ఫిర్యాదు చేశామని మయన్మార్ ఇండియన్ ఫారెన్ సర్వీసు కార్యాలయంలో పనిచేసే అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేణుక గతంలో తమ ఇంటిలో కేర్‌టేకర్‌గా పనిచేసిందన్నారు. తమపై దాడికి యత్నం చేసిన రేణుకపై వేదాయపాలెం పోలీసులు తక్కువ సెక్షన్ల కేసులు పెట్టి కేసును దారి మళ్లిస్తున్నారని ఆయన ఆవేదన చెందారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం

నెల్లూరు(సిటీ), ఆగస్టు 29,(ఆంధ్రజ్యోతి) : నగర కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో మేస్త్రీగా విధులు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యం మరణించడంతో అతని కుటుంబ వారసుడు అయిన భానుధర్‌కు కారుణ్య నియామకం కింద శుక్రవారం ఉద్యోగ అవకాశం కల్పించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని కమిషనర్ నందన్, ఆరోగ్య విభాగం అధికారులు ఆయనకు అందచేశారు.

పెరుగు రామకృష్ణకు తెలుగు భాషా పురస్కారం



నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 29 (ఆంధ్ర జ్యోతి): తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సృజనాత్మక, సాంస్కృతిక సమితి శుక్రవారం 14 మందికి తెలుగు భాషా పురస్కారాలు ప్రకటించింది. అందులో కవిత్వం విభాగంలో నగరానికి చెందిన అంతర్జాతీయ కవి పెరుగు రామకృష్ణ ఉన్నారు. ఈసారి జిల్లా నుంచి ఆయన ఒక్కరే ఎంపికైనందున పలువురు అభినందించారు.

గణనాథుడి లడ్డూ రూ.1.47 లక్షలకు వేలం



వేలంలో దక్కించుకున్న లడ్డూతో చైతన్య, జయేంద్ర

నెల్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గాంధీనగర్‌లోని ఎస్ఆర్ ఎలైట్ అపార్ట్‌మెంట్‌లో కొలువైన గణనాథుడి లడ్డూ రూ.1,47,900లకు వల్లటూరు చైతన్య, జయేంద్ర బ్రదర్స్ వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విఘ్నేశ్వరుడిని ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు.

'రాళ్లపాడు'లో నిమజ్జనం చేయొద్దు

లింగసముద్రం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయవద్దని ప్రాజెక్టు డీఈఈ ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ట్రేడ్ లైసెన్సు ఫీజు బకాయిలు రూ. 18.43 కోట్లు

- వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యం
- విద్యుత్ కమర్షియల్ కనెక్షన్లు 30 వేలకు పైగానే..
- కానీ వాణిజ్య ట్రేడ్ లైసెన్సులు 11,814 మాత్రమే
- వ్యత్యాసం వెనుక ఎన్నో అనుమానాలు

నెల్లూరు(సిటీ), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థ ఖజానాకు చేరాల్సిన ట్రేడ్ లైసెన్సుల ఫీజులు సక్రమంగా వసూలు కావడంలేదు. వీటిని క్రమం తప్పక వసూళ్లు చేయాల్సిన శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు చేతులెత్తేయడంతో బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయి. నగరంలోని 54 మున్సిపల్ డివిజన్లలో రూ. 18.43 కోట్లు కార్పొరేషన్ ఖజానాకు రావాల్సి ఉంది. ఇందులో రూ. 16.17 కోట్లు మొండి బకాయిలే ఉండటం గమనార్హం. కాగా విద్యుత్ శాఖ వాణిజ్య కనెక్షన్ల కింద నగరంలో సుమారుగా 30 వేలకు పైగా మీటర్లు మంజూరు చేస్తే కార్పొరేషన్ మాత్రం కేవలం 11,814 వాణిజ్య లైసెన్సులు కేటాయించడం అనుమానాలకు తావిస్తుంది. వాణిజ్య సంస్థగా ఉన్న ప్రతీ వ్యాపారి విధిగా ట్రేడ్ లైసెన్సు పొందాల్సి ఉండగా, విద్యుత్ శాఖ కనెక్షన్లకు, ఇటు ఎస్ఎంసీ ట్రేడ్లకు భారీ వ్యత్యాసం విమర్శలకు తావిస్తుంది.

● శానిటేషన్ ధ్రువీకరణ తప్పనిసరి

వాణిజ్యపరమైన నిర్మాణం ఏదైనాసరే తప్పనిసరిగా కార్పొరేషన్ నుంచి ట్రేడ్ లైసెన్సుతో పాటు ఎన్‌వోసీ, శానిటేషన్ ధ్రువీకరణ పొందాల్సి ఉంది. బహుళజాతి సంస్థ నుంచి క్షేత్రస్థాయిలో బడ్డీకొట్టు వరకు ఈ అనుమతులు తప్పనిసరి. వీటిని కార్పొరేషన్‌లోని ఆరోగ్య విభాగం పర్యవేక్షిస్తుంది. క్షేత్రస్థాయిలో శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు గుర్తించాల్సి ఉంది. కానీ ఎస్ఎంసీ లెక్కల ప్రకారం 11,814 లైసెన్సులు ఉన్నట్లు చూపుతున్నారు. వీటిల్లో డబల్ ఎంట్రీలు, నాట్ ట్రేసెడ్‌లు తీసేస్తే నికరంగా 9 వేలు మాత్రమే ఉంటాయని అధికార వర్గాలు చెప్పుకొస్తున్నాయి. ఈ లెక్కన చూసినా కార్పొరేషన్ ఖజానాకు రూ. 18.43 కోట్లు వసూళ్లు కావాల్సి ఉంది. ఇందులో మొండి బకాయిల కింద గుర్తించినవి ఏకంగా రూ. 16.17 కోట్లు వరకు ఉన్నాయి. మిగిలినది తాజా బకాయిలుగా అధికారులు లెక్క తేల్చారు. ఏటికేడు ట్రేడ్ బకాయి భారీగా పేరుకుపోవడం, వాటిని వసూళ్లు చేసి ఎస్ఎంసీకి జమ చేయడంతో ఆరోగ్య విభాగం విఫలం చెందుతుందనే వాదన బలంగా ఉంది. ఆదాయం తెచ్చిపెట్టే వనరులున్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో యంత్రాంగం ఘోరంగా విఫలమవుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

● భారీ వ్యత్యాసం ఎలా...?

నగరంలో వాణిజ్య నిర్మాణం చేపట్టిన ప్రతీ ఒక్కరూ విద్యుత్ శాఖ నుంచి కమర్షియల్ కనెక్షన్ పొందుతున్నారు. ఇలా 30 వేలకు పైగా ఉన్నాయన్నది విద్యుత్ శాఖ వర్గాలు చెప్తున్నాయి. అవే వాణిజ్య నిర్మాణాలకు కార్పొరేషన్ నుంచి ట్రేడ్ లైసెన్సులు మంజూరు చేయాల్సి ఉంది. కానీ ఆరోగ్య విభాగం వద్ద కేవలం 11,814 మాత్రమే ఉన్నాయి. అంటే 18,186 మంది వ్యత్యాసం ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

● క్షేత్రస్థాయిలో చేతివాటం

ట్రేడ్ లైసెన్సుల జారీ వెనుక ఆరోగ్య విభాగంలోని క్షేత్రస్థాయి ఉద్యోగుల చేతివాటం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు కుమ్మక్కై వ్యాపారుల వద్ద నెలనెలా మామూళ్లు తీసుకుంటూ అధికారిక లైసెన్సులు జారీలో అవకతవకలకు పాల్పడుతున్నారంటూ విమర్శలున్నాయి. సచివాలయాల వారీగా వ్యాపార సంస్థలు, దుకాణాలను బయటకు లెక్కకడితే భారీగా ఆదాయం కార్పొరేషన్ ఖజానాకు సమకూరుతుందని ఉద్యోగ వర్గాలే చెప్తున్నాయి. కొన్ని వాణిజ్య పెద్ద సంస్థల నుంచి రావాల్సిన ట్రేడ్ స్వల్పపాటిగానే వసూళ్లు చేస్తున్నారంటూ ఆరోపణలున్నాయి. ఎస్ఎంసీకి ఆదాయం తెచ్చిపెట్టే విభాగాల్లో మొదటిది రెవెన్యూ కాగా రెండవదిగా సిటీప్లానింగ్, ఆపై ఆరోగ్య విభాగంగా ఉంది.

ప్రత్యేక డ్రైవ్ పెట్టాం



ట్రేడ్ లైసెన్సుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ పెట్టాం. ఈ నెలలోనే సుమారుగా రూ. 50 లక్షల వరకు లైసెన్సు ఫీజులు జమ చేశాం. మొండి బకాయిదారులను గుర్తించి వచ్చే రెండో శనివారం లీగల్ నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నాం. ప్రతీ వాణిజ్య భవనానికి ట్రేడ్ వేస్తాం.

- డాక్టర్ కనకాద్రి, ఎంహెచ్‌వో

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధన



ప్రత్యేక అలంకరణలో వెంకయ్యస్వామి

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట గురునిలయంలోని భగవాన్ వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం 6 నుంచి రాత్రి 10గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో స్వామీజీలు తలుపూరు నారాయణదాసు, గాలిపాలెం శ్రీహరి స్వామి, కర్రబల్లవోలు అవధూత వెంకటాంబ శిష్యుడు కృష్ణయ్య స్వామి పాల్గొన్నారు. వీరి ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు, హోమాలు, సహస్ర నామార్చనలు, మహానివేదనలు, భజనలు, సంకీర్తనలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం సాయి దర్బార్ అద్దాల మందిరం భక్త బృందంచే భజనలు స్వామివారి నగరోత్సవం, చిన్నారుల నృత్య ప్రదర్శనలు జరిగాయి. ఈ కార్యక్రమాలను గురునిలయం నిర్వాహకులు గోపిచంద్ పర్యవేక్షించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తెలుగుభాషా దినోత్సవం గౌరవానికి ప్రతీక : వీపీఆర్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగుభాష కేవలం సంభాషణ మాత్రమే కాదని, తెలుగుజాతికి గర్వకారణమని, గౌరవానికి ప్రతీక అని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాకవి, భాషా సంరక్షకుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రతీ పౌరుడు తెలుగుభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.



విశేష అలంకారంలో రాజరాజేశ్వరి

సామూహిక రాహుకాల పూజ

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం సామూహిక రాహుకాల ఉద్దీపన పూజలు జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు రాహుకాల దీపారాధనలు చేశారు. ఛండీ హోమం, విశేష నవావరణ పూజలు జరిగాయి. సుందరేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం కుంభహారతులు, పల్లకీసేవ జరిగాయి. ఈ కార్యక్రమాలను సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.



సామూహిక రాహుకాల పూజలు చేస్తున్న మహిళలు

దేశంపై అసూయ అనే విఘ్నం తొలగించు స్వామీ!

- పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



శివాజీసెంటర్‌లోని గణేశ్ పూజల్లో పాల్గొన్న వెంకయ్యనాయుడు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో దినదినాభివృద్ధి చెందుతున్న భారత దేశంపై అసూయ అనే విఘ్నం ఉందని, దాన్ని తొలగించు స్వామీ.. అని వినాయకుడిని ప్రార్థించానని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన నగరంలోని వివిధ కూడళ్లలో గల వినాయక విగ్రహాల వద్ద పూజలు చేశారు. తొలుత గాంధీబొమ్మ సెంటర్‌లోని వరసిద్ధి వినాయక మందిరం, శివాజీ సెంటర్ మిత్రమండలి ఏర్పాటు చేసిన ఉత్సవ గణపతిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయుల ఐక్యత కోసం బాలగంగాధర్ తిలక్ గణేశ్ ఉత్సవాలను తొలుత ప్రారంభించారని తెలిపారు. ఆయన ఆశయాలను నేటి యువత పూర్తిస్థాయిలో నెరవేర్చాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట కేవీ.సుబ్రహ్మణ్యం, వీ.సత్యనాగేశ్వరరావు, శ్రీకంఠం రమణయ్యనాయుడు, పలువురు అభిమానులు ఉన్నారు.

- నగరంలోని కాంత్రినగర్‌లో శివకేశవుల ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి ఆలయ ట్రస్ట్ చైర్మన్ దర్శిగుంట పెంచలయ్య ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.
- రామ్‌నగర్ శబరి శ్రీరామక్షేత్రం ఆధ్వర్యంలో గణేషుడికి విశేష పూజలు జరిగాయి. అలాగే అన్నీ సెంటర్లలో ఉత్సవ గణపతులకు పూజలు, భక్తులకు అన్నదానాలు జరిగాయి. గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, విశేష అలంకారాలు జరిగాయి.

ఏఎంసీ లాభదాయకంగా ఉండేలా కృషి చేయండి

- ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి నారాయణ

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) లాభదాయకంగా ఉండేందుకు కృషి చేయాలని మున్సిపల్‌శాఖామంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం నగరంలోని పిచ్చిరెడ్డి కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసి ఏఎంసీని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. రూరల్ ఎమ్మెల్యే నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అభివృద్ధి చేశారని, యువనాయకుడు లోకేష్ సైతం కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రశంసించారని చెప్పారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు ఏఎంసీ గౌరవం పెంచేలా కమిటీ సభ్యులు పనిచేయాలన్నారు. కష్టించి పనిచేసిన ప్రతీ ఒక్కరిని భుజం తట్టి ప్రోత్సహిస్తానన్నారు. అనంతరం చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాపూరు చంద్రశేఖర్‌లతోపాటు 13మంది డైరెక్టర్లు ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జనసేన నాయకులు పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, సర్పంచులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కనే ఏఎంసీ చైర్మన్, వైస్‌చైర్మను

లార్వా, ఫీవర్ సర్వే విధిగా చేయాలి

- జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న మలేరియా అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లార్వా, ఫీవర్ సర్వేలను విధిగా నిర్వహించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నగరంలోని రామచంద్రాపురం పట్టణ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఇక్కడ రిజిస్టర్లు, ఫీవర్ యాక్టివ్ కేసుల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా స్లైడ్‌లను 24 గంటలలోపు పరీక్షలు చేయాలని తెలిపారు. ఆయా స్లైడ్‌లను ఐదునెలల పాటు భద్రపరిచాలని పేర్కొన్నారు.లార్వా , ఫీవర్ సర్వే చేసి ఎక్కడైనా కేసులు నమోదయితే వెంటనే ఆయా ప్రాంతాల్లో వైద్య చికిత్సలు అందించాలన్నారు. ఫ్రైడే డ్రైడే పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలని కోరారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది చేత కాలువలను శుభ్రం చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు, సబ్ యూనిట్ అధికారి శ్యాంసన్, వెంకటేశ్వరరావు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గణనాథుల నిమజ్జనం

కొండాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న గణనాథుల విగ్రహాలకు శుక్రవారం నిమజ్జన కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. 3వరోజు బీమవరప్పాడు, గుడవళ్లూరు, తూర్పుఎర్రబల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

'తెలుగు' అక్షరాల ఆకృతిలో విద్యార్థులు



తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నెల్లూరు రూరల్ మండలంలోని అల్లీపురం వద్ద విశ్వం హైస్కూల్ వినూత్న ప్రదర్శన నిర్వహించారు. జై తెలుగు తల్లి అంటూ నినదించిన చిన్నారులు తెలుగు అక్షరాల ఆకృతిలో కూర్చుని చూపరులను ఆకర్షించారు. తెలుగు భాషా దినోత్సవానికి శుభాకాంక్షలని తెలిపారు. అంతరించిపోతున్న తెలుగుభాషా ప్రాధాన్యతకు విద్యార్థులు తిరిగి జీవం పోసినట్టుగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు.

- నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి)

తీయనైన తెలుగు అందరికీ అమ్మ



సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

నెల్లూరు(విద్య), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తియ్యనైన తెలుగుభాష అందరికీ అమ్మ వంటిదని రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నగరంలోని సరస్వతినగర్ డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో శుక్రవారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలను నేటితరం విద్యార్థులకు తెలియ చేసేలా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులు తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా వస్త్రధారణతో నిర్వహించిన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తెలుగుభాషా సాహిత్యాన్ని, గొప్పతనాన్ని తెలియచేసిన శ్రీకృష్ణదేవ రాయులు, అష్టదిగ్గజ కవుల భువనవిజయం నాటికతో తెలుగు భాషలోని ముత్యాల సరాల కావ్యాలను, వజ్రాల వంటి పద్యాలతో విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ కవులైన నన్నయ, తిక్కన, ఎర్రన, పదకవితా పితామహులు తాళ్లపాక అన్నమయ్య, వ్యావహారిక భాషోద్యమ నాయకులు గిడుగు రామ్మూర్తి వేషధారణతో చేసిన ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు విడుదల చేయాలి :అవాజ్ కమిటీ



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రషీద్

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు వెంటనే విడుదల చేయాలని అవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ డిమాండ్ చేశారు. శుక్ర వారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదాయం తక్కువ ఉన్న మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్, మౌజన్లకు ప్రతి నెలాఇచ్చే గౌరవ వేతనం ఇచ్చేందుకు ఎన్నికల ముందు టీడీపీ హామీ ఇచ్చిందన్నారు. వారి మ్యానిఫెస్టోలో మైనార్టీలకు సబ్సిడీ రుణాలు, 50 ఏళ్లకే పింఛన్లు, ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు వంటివి ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో కేవలం 6 నెలల గౌరవ వేతనం మాత్రమే ఇచ్చిందన్నారు. 9 నెలలుగా ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం అందలేదన్నారు. వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ క్రమంలో ఈనెల 30న జిల్లాలోని స్థానిక తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అవాజ్ కమిటీ సభ్యులు షేక్ రియాజ్, సయ్యద్ రవూఫ్, షేక్ సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

బాలికా సదనంలో జాతీయ క్రీడా దినోత్సవం



బాలికా సదన్‌లో పిల్లలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హేనాసుజన్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలో స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికా సదన్‌లో శుక్రవారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ మాట్లాడుతూ క్రీడాదిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటున్నా మని చెప్పారు. భారతక్రీడా రంగానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం పిల్లల చేత ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి బీ.సురేష్, బాలికా సదనం సూపరింటెండెంట్ దుర్గ, బాలసదన్ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెరైటీ వినాయకులు..


పొదలకూరు : సూర్యప్రభ అలంకరణలో లక్ష పుష్పాలతో విఘ్నేశ్వరుడు


కావలి : పట్టణంలోని వైకుంఠపురం రామాలయం సెంటర్‌లో..


సంగం : గాంధీజన సంఘంలో రాముడి వేషధారణలో.


ఉదయగిరి : సర్వరాబాదులో కరెన్సీ నోట్లతో అలంకరణ


పొదలకూరు : అంజనీసుతుడిపై విఘ్నేశ్వరుడి వైభవం

ఓటీపీతో రిజిస్ట్రేషన్లకు కష్టాలు

- ముందస్తు ఫీజు చెల్లింపుతో ఇక్కట్లు
- రద్దు చేయాలంటున్న డాక్యుమెంట్ రైటర్లు

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భూములు, స్థలాల క్రయవిక్రయాల దస్తావేజుల రిజిస్ట్రేషన్ సందర్భంలో ప్రభుత్వం తీసుకువచ్చిన ఓటీపీ విధానంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ కోసం తీసుకొచ్చిన ఈ విధానం అమలు అస్తవ్యస్తంగా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు క్రయ, విక్రయ దారులకు సంబంధించిన ఫోన్లకు ఓటీపీ వెళుతుంది. ఆ నంబరు చెబితేనే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. లేకపోతే లేదు. ఏదైనా ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ముందుగా స్లాట్ బుక్ చేసుకుని అందులో ఇచ్చిన సమయానికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలి. ఇందువల్ల జాప్యం లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ఈ పద్ధతి మంచి ఫలితాలను ఇవ్వటంతో మరోసేవను రిజిస్ట్రేషన్‌శాఖ అందుబాటులోకి తీసుకుని వచ్చింది. దస్తావేజు



రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే కొనుగోలు చేసిన వ్యక్తి మొబైల్‌కు రిజిస్టర్ అయిన దస్తావేజు వాట్సాప్ ద్వారా వస్తుంది.

● ముందస్తు చెల్లింపులతో ఇక్కట్లు

ఆస్తి లావాదేవీలకు ఆస్తి విలువను బట్టి స్టాంపు డ్యూటీ, ఫీజులు, యూజర్ చార్జీ ముందుగానే ఆన్‌లైన్‌లో చలానా రూపంలో చెల్లించి పబ్లిక్ డేటాలో ఎంటర్ చేయటం వలన అవినీతికి ఆస్కారం ఏర్పడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ విధానం రాక ముందు ఆస్తి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి దస్తావేజులు పూర్తిచేసి పబ్లిక్ డేటా ఎంటర్ చేసి, చెక్‌స్లిప్ వేసిన తరువాత సబ్‌రిజిస్ట్రార్ పరిశీలిస్తారు. అనంతరం స్టాంపుడ్యూటీ, ఫీజు, యూజర్ చార్జీలు చెల్లించే వారు. అనంతరం రిజిస్ట్రేషన్ జరిగేది. ఈ విధానం బాగుండేది. కాని కొత్తగా ఆస్తివిలువలను బట్టి రిజిస్ట్రేషన్ ఫీజులు ఒకేసారి చలానాల ద్వారా ముందుగా చెల్లించి పబ్లిక్ డేటాలో ఎంటర్ చేయాల్సి వస్తోంది. ఈ విధానంలో ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించటం వలన, కొంతమంది అవినీతి పరులైన సబ్‌రిజిస్ట్రార్‌లు రిజిస్ట్రేషన్ చేసే సందర్భంలో వేలకు వేలు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● ఇంటి పన్నులు మారతాయో... లేదో...?

ఆటోమ్యూటేషన్ విధానం అమలు లోకి రావటంతో డోర్ నంబరు, ఆస్తి అసెస్మెంట్ నంబరు వ్యవహారంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆటో మ్యూటేషన్ రిజిస్ట్రేషన్ కోసం పబ్లిక్ డేటాలో ఇంటి డోర్ నంబరు ఫీడ్ చేస్తే, అసెస్మెంట్ నంబరు కంప్యూటర్ డేటాలో కనిపించటం లేదు. అసెస్మెంట్ నంబరు ఫీడ్ చేస్తే, ఇంటి డోర్‌నంబరు కనిపించటం లేదు. ఇలా రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజులకు సంబంధించి ఇంటి పన్నులు మారుతాయో లేదో అనే భయాందోళనల్లో రిజిస్ట్రేషన్‌దారులు ఉన్నారు.

ఓటీపీ విధానం రద్దు చేయాలి



దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు ప్రవేశపెట్టిన ఓటీపీ విధానం వలన రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలి. ఈ విధానంతో అందరి ఓటీపీలు చెప్పాల్సి రావటంతో రిజిస్ట్రేషన్‌కు విఘాతం కలుగుతోంది. ఒక రిజిస్ట్రేషన్‌కు రెండు నుంచి మూడు రోజులు పడుతోంది. ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న ఓటీపీ విధానాన్ని రద్దు చేయకపోతే ఉద్యమం చేస్తాం.

- పట్నం దుర్గేష్‌బాబు, జిల్లా డాక్యుమెంటు రైటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు


జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌తో రామకృష్ణాపురం గ్రామం ఎస్టీ బాధిత మహిళలు

గిరిజన మహిళల ఫిర్యాదుపై జాతీయ ఎస్టీ కమిషన్ విచారణ

ఉలవపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తమపై కేసులు బనాయించి పోలీసులు వేధిస్తున్నారన్న మండలంలోని రామకృష్ణాపురంకు చెందిన బాధిత మహిళల ఫిర్యాదుపై జాతీయ ఎస్టీ కమిషన్ శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ పక్కన ఉన్న దిల్‌కుషా అతిథి గృహంలో విచారణ చేపట్టింది. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జటోత్ హుస్సేన్ నాయక్ రామకృష్ణాపురం గిరిజన మహిళలతోపాటు కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యంను విచారణ చేపట్టారు. కరేడు భూసేకరణ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా గ్రామంలో కట్టుబాటు ప్రకారం నడుచుకుంటుండగా జరిగిన ఘర్షణలో మాణికల శిరీష, సుజాత, లలితలపై అదే గ్రామానికి చెందిన శేషమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై అర్ధరాత్రి పోలీసులు వ్యవహరించిన తీరు, అక్రమంగా తమని జైలుకు పంపించిన విధానంపై బాధత మహిళలు ఆయనకు వివరించారు. అసలేమి జరిగిందనే విషయాన్ని డీఎస్పీ వివరించారు. ఇండోసోల్ భూసేకరణ, గిరిజన మహిళలపై పెట్టిన కేసుల వివరాలకు సంబంధించి 15 రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులను అనంతరం కమిషన్ సభ్యుడు ఆదేశించినట్లు బాధితులు తెలిపారు. త్వరలో గ్రామంలో స్వయంగా పర్యటిస్తానని, అంతవరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించినట్లు తెలిపారు. బాధిత గిరిజన మహిళల వెంట ఆదివాసి అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు రమావత్ శ్రీరాం నాయక్, ఉలవపాడు సీపీఎం ప్రాంతీయ కమిటీ సభ్యుడు జీవీబీ కుమార్, జిల్లా గిరిజన సంఘం నాయకులు చేవూరి రాంబాబు, రాచూరి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

క్షేత్ర సహాయకుడిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ పంచాయతీలో ఉపాధి నిధులు స్వాహా చేశాడని వచ్చిన ఆరోపణల పట్ల క్షేత్ర సహాయకుడిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ అంబుడ్స్ పర్సన్ వెంకటరెడ్డి నోటీసులు జారీ చేశారు. పంచాయతీ పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.2,50,624 లక్షల నిధులు దుర్వినియోగం చేశారని, తన కుటుంబ సభ్యులతోపాటు మరికొంతమంది వేతనదారుల నకిలీ సంతకాలు, వేలిముద్రలు మస్టర్లపై వేసినట్లు విచారణలో తేల్చారు. అలాగే ఉద్యోగులు, విద్యార్థులు, మరణించిన వారికి మస్టర్లు వేసి నిధులు స్వాహా చేసినట్లు నోటీసులో పేర్కొన్నారు. అధికారులు చేపట్టిన విచారణకు సహకరించకపోవడం, అతనిపై వచ్చిన ఆరోపణలు వాస్తమని తేలినట్లు నోటీసులో పేర్కొన్నారు. దీంతో అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ సూచించారు. ఈ విషయాన్ని మండల అధికారులు సైతం ధ్రువీకరించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

- రూ.9.50 లక్షల ఎరువుల సీజ్

లింగసముద్రం: కావలి ఏడీఏ సీహెచ్ నాగరాజు ఆధ్వర్యంలో లింగసముద్రం, కందుకూరు వ్యవసాయశాఖ అధికారులు బీ.రవి కుమార్, షేక్ అబ్దుల్ రహీంలు మండలంలోని లింగసముద్రం, పెదపవని, చినపవని, వీఆర్ కోట గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పెదపవనిలోని రెండు, లింగసముద్రంలోని రెండు ఎరువుల దుకాణాలలో సరియైన పత్రాలు లేకుండా నిల్వ ఉంచిన రూ.9.50 లక్షల ఎరువులను గుర్తించి సీజ్ చేశారు. తమ అనుమతి లేకుండా ఆ ఎరువులను విక్రయిస్తే షాపుల లైసెన్సులను రద్దు చేస్తామని ఆయన డీలర్లను హెచ్చరించారు.


పెదపవనిలోని ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న కావలి ఏడీఏ నాగరాజు

గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక


ఎంపికయిన జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యవర్గం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు, పెన్షనర్లకు 010 పద్దు కింద జీతాలు, పింఛన్లు ఇవ్వాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ.మల్లేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పెన్షనర్స్ రాష్ట్ర నాయకులు కే. త్రిమూర్తులు మాట్లాడుతూ మున్సిపాలిటీలు, పంచాయతీలు బకాయిపడిన రూ.1062 కోట్లను జిల్లా గ్రంథాలయ సంస్థలకు జమ చేసేలా ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ సమర్థవంతంగా పనిచేస్తూ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.

● కార్యవర్గం ఎంపిక

జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యవర్గం ఎంపికైంది. నగరంలోని మహిళా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఏ.గోవిందరావు, సలహాదారులుగా ఆర్. దశరథరామిరెడ్డి, రాష్ట్ర ప్రతినిధిగా ఐ.సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా వీ.రంగారావు, ఉపాధ్యక్షులుగా సుభాష్ చంద్రగుప్త, ఎం.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.శ్రీనాథ్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా డీ.జయమ్మ, నిర్వాహక కార్యదర్శిగా వీ.సుధాకరాచారి, కోశాధికారిగా ఈ.ఏడుకొండలు, ఇతర సభ్యులు ఎంపికయ్యారు. ఎంపికైన కమిటీని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా అభినందించారు.

తెలుగు భాషోత్సవాల ప్రారంభం

- 31 వరకు నిర్వహణ
- ముఖ్యఅతిథిగా పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- వివిధ సాహితీ ప్రక్రియల్లో పాల్గొన్న ప్రముఖులు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సేవ తెలుగు భాషా సాహితీ, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే తెలుగుభాషోత్సవాలు నెల్లూరు పురమందిరంలో శుక్రవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పూర్వఉపరాష్ట్రపతి ఎంపీ వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. గిడుగు వెంకటరామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆయన గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ప్రసారభారతి విశ్రాంత అదనపు డైరెక్టర్ డాక్టర్ రేవూరు అనంతపద్మ నాభరావు అధ్యక్షత వహించారు. తెలుగుభాషా పరిరక్షణకు వెంకయ్యనాయుడు, దిశా నిర్దేశం చేశారు. ఈ సభలో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ కీలకోపన్యాసం చేశారు. గిడుగు ఆలోచనల మేరకు తెలుగు భాషను ఆలోచనా పరగా అభివృద్ధి చేసుకోవాలని కోరారు. అందుకు నేటితరం చేపట్టాల్సిన కార్యాచరణ వివరించారు. అ.జో.వి.భో ఫౌండేషన్ చైర్మన్ అప్పాజోష్యుల సత్యనారాయణ మాట్లాడుతూ ఉపన్యాసాలతో తెలుగు భాషను రక్షించుకోలేమన్నారు. చైనాలో వారి మాతృభాషలోనే చదువు, పరిపాలన అన్నీ పనులు చేస్తున్నారని, అందుకే ఆ దేశం అభివృద్ధి చెందిందన్నారు. తెలుగు భాషను అన్నీ రంగాలలో వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ గజల్ పాడి సభికులను అలరింపచేశారు. అనంతరం చిన్నారుల ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. ఆ చిన్నారులను వెంకయ్య నాయుడు అభినందించారు. వారితో ఫొటో దిగి మెమోంటో అందించారు. కాగా మధ్యాహ్నం ప్రాచీన సాహిత్య సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సును అప్పాజోష్యుల సత్యనారాయణ కీలకోపన్యాసం చేశారు. డాక్టర్ పాతూరి అన్నపూర్ణ అధ్యక్షతన కవితోత్సవం నిర్వహించారు. ఈ సభలో వెంకయ్య నాయుడు అతిథులు, కార్యక్రమానికి సహకరించిన వారిని సన్మానించి, మెమోంటోలు అందజేశారు. అనంతరం గిడుగు వారసురాలు గిడుగు సరస్వతిని సన్మానించారు. చివరిగా బాల సాహిత్య సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సభాధ్యక్షులుగా డాక్టర్ గంగిశెట్టి శివకు మార్, విశిష్ట అతిథులుగా డాక్టర్ డీకే చదువుల బాబు, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, చంద్రలత, డాక్టర్ కందిపి రాణీప్రసాద్, దార్ల బుజ్జయ్య, టీ. రామకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో నలుబోలు బలరామయ్య నాయుడు, పీఎంసీ (అమెరికా) ప్రారం భించారు. కథకులు, విమర్శకులు ఆచార్య పాపినేని శివశంకర్ కీలక ఉపన్యాసం చేశారు. అనంతరం కవితోత్సవం నిర్వహించారు. రాత్రి తిక్కన సాహిత్య సదస్సు జరిగింది. ఈ సదస్సును అంతర్జాతీయ కవి పెరుగు రామకృష్ణ ప్రారంభించారు. కవి సంధ్య సంపాదకులు ఆచార్య శిఖామణి అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్, రచయితలు అవ్వారు శ్రీధర్‌బాబు, చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావు, దగ్గుబాటి రాధాకృష్ణ, గోవింద రాజు సుభద్రాదేవి పాల్గొన్నారు. తొలిరోజు కార్యక్రమాలను విజయవంతం చేసిన అతిథులు, ఉపన్యాసకులు, కవులకు సేవా సంస్థ అధ్యక్షుడు కం చర్ల సుబ్బానాయుడు కృతజ్ఞతలు తెలిపారు.



సభలో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు, హాజరైన ప్రజలు

గణనాథుడి నిమజ్జనోత్సవంలో అపశ్రుతి

- బాణసంచా పేలి 10 మంది చిన్నారులకు తీవ్ర గాయాలు

ఉదయగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పసముద్రం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గణనాథుడి నిమజ్జనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకొంది. ట్రాక్టర్‌లో ఉంచిన బాణసంచా ప్రమాదవశాత్తు పేలి 10 మంది చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా నిమజ్జనోత్సవానికి తరలుతున్నారు. ఈ సమయంలో సమీప గ్రామమైన నడింపల్లిలో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని సైతం అదే మార్గంలో నిమజ్జనోత్సవానికి వెళుతున్నారు. కాగా, నడింపల్లి వాహనం ముందు బాణసంచా పేల్చడంతో నిప్పురవ్వలు ఎగిసిపడి అప్పసముద్రం ట్రాక్టర్‌లో ఉన్న బాణసంచాపై పడ్డాయి. దీంతో అవి ఒక్కసారిగా పేలడంతో ట్రాక్టర్‌లో బాణసంచా పక్కనే కూర్చొని ఉన్న కార్తీక, రోహిత్ రెడ్డి, బాబు, మధురిమ, ప్రవల్లికలతోపాటు మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని హుటాహుటిన తమ వాహనాల్లో చికిత్స నిమిత్తం దుత్తలూరుకు తరలించారు. అనంతరం అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కొందర్ని వింజమూరు, మరికొందర్ని ఆత్మకూరు వైద్యశాలలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ అల శ్రీను వైద్యశాలలకు చేరుకుని వివరాలు సేకరించారు.


వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారులు


అవార్డు అందుకుంటున్న పాఠశాల సిబ్బంది

బీవీఎస్ పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు

నెల్లూరు(విద్య), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని నవాబుపేట బీవీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు దక్కింది. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు శుక్రవారం అవార్డును అందచేసి మాట్లాడారు. పాఠశాలల్లో క్రీడల నిర్వహణలో బీవీఎస్ అత్యధిక పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, స్కూల్ ఎడ్యుకేషన్, ఎస్‌జీఎఫ్‌లు ఈ అవార్డును ప్రకటించిందన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని విజయాలు సొంతం చేసుకుని అవార్డులు అందుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం ఎం.విజయజ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయులు పీ.అజయ్‌కుమార్, క్రీడాకారులను డీఈవో అభినందించారు.

ఉపాధ్యాయ కొలువుల కోలాహలం

- కొనసాగిన డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన

నెల్లూరు (విద్య), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2025లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కేంద్రం యువ ఉపాధ్యాయులతో కోలాహలంగా మారింది. వందలాది మంది అభ్యర్థులు తమ పత్రాలను పరిశీలించుకుంటూ అధికారులతో మాట్లాడుతూ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. నగరంలోని వీఆర్ ఐపీఎస్‌లో రెండురోజులపాటు నిర్వహించిన ఈ ప్రక్రియ తొలిదశ శుక్రవారం రాత్రితో ముగిసింది. మెగా డీఎస్సీ-2025 సంబంధించి అన్ని సబ్జెక్టుల మెరిట్ జాబితాలను ఇప్పటికే డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచిన నేపథ్యంలో వివిధ కేటగిరీ పోస్టులకు సంబంధించిన సర్టిఫికెట్ పరిశీలనను విద్యాశాఖ అధికారులు చేపట్టారు. దీనికోసంగా 17 కమిటీల నేతృత్వంలో పరిశీలన కొనసాగింది. డీఈఓ ఆర్.బాలాజీరావు పర్యవేక్షణలో డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలతోపాటు డిప్యూటీ తహసీల్దార్, టెక్నికల్ అసిస్టెంట్స్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, డిసేబుల్డ్ వెల్ఫేర్ శాఖల అధికారులు, గురుకుల విద్యాలయాల ప్రతినిధులు బృందాలుగా హాజరై అభ్యర్థుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తం మీద 673 పోస్టులకు గాను 641 మందికి కాల్‌లెటర్స్ అందగా వీరిలో 8 మంది గైర్హాజరయ్యారు. మిగిలిన 32 మందిలో స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు కొంతమందికి విజయవాడలోనే పరిశీలిస్తారని, మిగిలిన వారికి సంబంధించి సర్టిఫికెట్లలో చిన్న సమస్యలున్నాయని, వీటిని నివృత్తి చేసిన అనంతరం రాష్ట్ర అధికారులు పరిశీలిస్తారని డీఈఓ తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులకు సంబంధించి వైద్య అధికారుల పరిశీలన అనంతరం శనివారం డీఈఓ కార్యాలయంలో పరిశీలన పూర్తి చేసుకుంటారని తెలిపారు.

వివిధ రంగాల్లో గ్రామీణ యువతకు శిక్షణ

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోగోలులోని లావా ఎడ్యుకేషనల్ కన్సల్టింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, కోవూరులోని త్రేడ్జ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రాల్లో ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్స్ ఫీల్డ్ టెక్నీషియన్, కంప్యూటింగ్ పెరిఫెరల్స్, సర్వీస్ ఇంజనీర్-ఐటీ హార్డ్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు కలిగి, ఇంటర్, డిగ్రీ చదివిన యువతీయువకులు అర్హులన్నారు. శిక్షణ 3 నుంచి 5 నెలలు వరకు ఉంటుందన్నారు. ఉచిత, వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో యూనిఫాం, మెటీరియల్, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇచ్చి, ఉపాధి కల్పిస్తామని ఆమె వివరించారు. అర్హత కలిగిన వారు బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జెరాక్సు కాపీలతో నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని కలెక్టరేట్ కాంపౌండ్‌లో ఉన్న డీఆర్‌డీఏ-జాబ్స్ విభాగంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 0861-2321261, 9490080861, 8985120012 నంబర్లను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనోత్సవం చేసుకోవాలి : డీఎస్పీ

సంగం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ సూచించారు. శుక్రవారం సంగం పెన్నానదిలో వినాయక విగ్రహాల నిమజ్జన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఏర్పాట్లపై సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ రాజేష్‌లను అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు, సలహాలు అందచేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9812
వెండి కిలో ధర	రూ. 120900
వెండి ఒక గ్రాము	రూ. 123.90

న్యూస్ బాక్స్

గిడుగు సేవలు చిరస్మరణీయం



గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంఈవో

ఉదయగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు వ్యవహారిక భాషకు గిడుగు వెంకటరామ్మూర్తి సేవలు చిరస్మరణీయం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి ఆధ్వర్యంలో గిడుగు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే అప్పసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తెలుగుభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ నరసింహులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'తాటిపర్తి'కి పురస్కారం

సంగం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మక్తాపురంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు తాటిపర్తి వెంకటేశ్వర్లుకు శుక్రవారం తెలుగు భాషా పురస్కారం అందచేశారు. తెలుగు భాషా దినోత్సవం (గిడుగు జయంతిని) పురస్కరించుకుని తెలుగు భాషా, సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులో తాటిపర్తి వెంకటేశ్వర్లుకు గిడుగు వారసులు సరస్వతి, గణేష్ కార్తీక్‌ల చేతుల మీదుగా తెలుగు భాషా పురస్కారం అందచేశారు.

ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు కృషిచేయాలి

వింజమూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు కృషిచేయాలని జిల్లా సాధన కమిటీ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కోరారు. జిల్లాల పునర్విభజనపై శనివారం మంత్రివర్గ ఉప సంఘం నెల్లూరు జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా శుక్రవారం నల్లగొండ్లలో ఎమ్మెల్యే కాకర్లను నాయకులు కలిసి మెమోరాండం ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉదయగిరి జిల్లా సాధన కమిటీ నాయకులు ఎండి ఖాజా, శ్రీరామ చంద్రమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎల్‌సీ రమణారెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు ఎం బాలకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

వరి సాగుపై అవగాహన

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.కొండారెడ్డిపల్లిలో శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం, ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు వరి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ దేవసేన మాట్లాడుతూ సాగులో ఉన్న వరిపంటను పరిశీలించి జింకు లోపం గుర్తించామని, అలాంటి రైతులు దుక్కి సమయంలో 20 కేజీల జింకు వేయాలన్నారు. అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో సునీల్, వీఏఏలు హరనాథ్, రైతులు పాల్గొన్నారు.

ఆపన్నులకు సీఎం సహాయనిధి వరం

చేజర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అనుకోకుండా జరిగిన సంఘటనలు, అనారోగ్య కారణాలతో ప్రైవేటు వైద్యశాలల్లో ఆపరేషన్లు, చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని మండల టిడిపి అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ పేర్కొన్నారు. చేజర్లలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంలో చేజర్ల మండలంలో 14 మందికి రూ.11.10 లక్షల చెక్కులను గురువారం మంత్రి ఆనం చేతుల మీదగా లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు.

ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు

ఉదయగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో శుక్రవారం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ టీ గోపీకృష్ణ బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించామన్నారు. ఆ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసినట్లు తెలిపారు.



ఆత్మకూరులో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు



అనంతసాగరంలో...



చేజర్ల మండలం చిత్తలూరులో ఉత్సాహంగా..

కోలాహలంగా గణనాథుడి నిమజ్జనోత్సవం

ఆత్మకూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం గణేష్ నిమజ్జన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. పట్టణంలో పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన 36 విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్ళాయి. వినాయకుని విగ్రహం వద్ద జరిగిన పూజా కార్యక్రమాల్లో పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. స్పార్క్‌సిటీ, పంటవీధి, తోటవీధి, నాగేంద్రపురం, జేఆర్ పేట, ఎల్‌ఆర్‌పల్లి, అరుంధతీయవాడ, హరిజనవాడ, నెల్లూరుపాళెం, పేరారెడ్డిపల్లి, టిడ్కో గృహసముదాయం తదితర ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి. గణనాథుల విగ్రహాల నిమజ్జన ఉత్సవం పెన్నమ్మ ఒడిలో కోలాహలంగా జరిగింది. శుక్రవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన నిమజ్జనోత్సవం రాత్రి వరకు కొనసాగింది. ఆత్మకూరు పట్టణంతోపాటు వివిధ గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల్లో గణేష్ విగ్రహాలను భక్తులు కోలాహలంగా అప్పారావుపాళెం, బొగ్గేరు, సంగం ఆనకట్ట వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఆత్మకూరు పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ కె వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పటిష్ట ఏర్పాట్లను చేశారు.

● **సంగం :** మండల కేంద్రంలోని శివాజీ సెంటర్, వడ్డిపాళెం, తిరుమనతిప్ప తదితర కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి పెన్నానదికి తరలించారు. గ్రామోత్సవంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అదేవిధంగా సంగం చుట్టుపక్కల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి సంగం పెన్నానదికి తరలించారు. సీఐ వేమారెడ్డి పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొత్త నోట్లతో బాలగణనాథునికి అలంకరణ

మండలంలోని సిద్దీపురంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన బాలగణనాథుడిని శుక్రవారం రూ. 3లక్షల విలువైన కొత్త నోట్లతో అలంకరించారు. బాలగణనాథుడి విగ్రహం ఏర్పాటుచేసిన ఆంజనేయస్వామి యూత్ పది, ఇరవై, యాభై, వంద, రెండు వందల రూపాయల (సుమారు రూ. 3 లక్షలు) కొత్త నోట్లతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు.

● **చేజర్ల :** మండలంలో వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. గణనాథుడికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అదేవిధంగా పలు గ్రామాలలో శుక్రవారం గణపతి విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించి, పెరుమాళ్ళపాడు, కోటితీర్థం, టికపాడు, పెన్నాతీరంతో పాటు కండలేరు జలాశయం వద్ద నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ తిరుమలరావు చర్యలు తీసుకున్నారు.

● **అనంతసాగరం :** మండలంలోని పాతదేవరాయపల్లి, లింగంగుంట, ఆమనిచిరివేళ్ల, గౌరవరం, సంజీవనగరం, ఉప్పలపాడు, మంచాలపల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన గణనాథులను శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. తొలుత లడ్డు వేలం పాట నిర్వహించి గ్రామంలో ఘనంగా ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

● **ఏఎస్ పేట :** వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను శుక్రవారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా స్థానిక హిందూ స్కూల్ వద్ద ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం కమిటీ సభ్యులు ఉట్టి ఉత్సవం నిర్వహించారు. అదేవిధంగా అనుమసముద్రం గ్రామంలోని వినాయక సెంటర్ వద్ద ఉట్టి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాలలో విగ్రహాలను మేళతాళాలతో గ్రామంలో ఊరేగించి సంగంలోని పెన్నా నదిలో నిమజ్జనం చేశారు.

● **ఉదయగిరి:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలు శుక్రవారం నిమజ్జనానికి తరలాయి. మండలంలోని పలు గ్రామాలతోపాటు ఉదయగిరి పట్టణంతో మండలంలోని శకునాలపల్లి, అప్పసముద్రం, దుంపవారిపల్లి, గండిపాళెం, చెరువుపల్లి, చెర్లోపల్లి, కృష్ణంపల్లి, బండగానిపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను వాహనాల్లో గ్రామపురవీదుల్లో మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ నిమజ్జనానికి తరలించారు. ఉట్టి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం సమీపంలో ఉన్న నీటి వనరుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. అలాగే దుత్తలూరు మండలంలో పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలకు నిమజ్జనోత్సవం నిర్వహించారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆకట్టుకున్న కరెన్సీ గణపతి

మండలంలోని సర్వరాబాదు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి గ్రామస్థులు కరెన్సీ నోట్లను దండలుగా వేసి అలంకరించారు. గ్రామంలో ప్రతి ఏడాది స్వామివారి విగ్రహానికి కరెన్సీ నోట్లతో అలంకరణ చేపట్టడం ఆనవాయితీ. అలాగే పలు మండపాల్లో విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** మండలంలోని జీ.కొండారెడ్డిపల్లి, జీ.కొత్తపల్లి, కనియంపాడు, తూర్పుకొండారెడ్డిపల్లి, విరువూరులోని మారుతినగర్, పాపన్నగారిపల్లి, పామూరుపల్లి, ధర్మవరం, తొడుగుపల్లి, గొల్లపల్లి గ్రామంతో పాటు ఎస్టీ కాలనీ తదితర గ్రామాల్లో శుక్రవారం గణేష్ నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బాణాసంచా, మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే యువత ఉట్టి ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం చెరువులు, వాగులు, వంకల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కాగా, పామూరుపల్లిలో వినాయకుడి లడ్డును సత్తి వెంగయ్య రూ. 69,500వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. ఉప్పుటూరి కృష్ణయ్య రూ. 15,600కు ప్రమిదలను, రేవూరి వెంగళరావు రూ. 20వేలకు హుండీని, రెడ్లదిన్నె పాతయ్య రూ. 13వేలకు కలశంను సొంతం చేసుకున్నారు. అలాగే పాపన్నగారిపల్లిలో అంబటి రాజేష్ రూ. 11వేలకు లడ్డును వేలంలో దక్కించుకున్నారు.

● **సీతారామపురం:** మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని ఓన్నమరాజు పల్లి గ్రామంలో లడ్డూ వేలంలో ఓంకారం దామోదర్‌రాజు రూ. లక్షా 60వేలకు లడ్డును, ఓంకారం సురేష్ రాజు రూ. లక్షా 40 వేలకు వెండి కలశంను దక్కించుకున్నారు. అనంతరం గణనాథుడి నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించారు.



ఉదయగిరిలో యువత హుషారు



సంగంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



సీతారామపురంలో నిమజ్జనానికి తరలుతున్న బొజ్జ గణపయ్య

నల్లగొండ్ల దేవస్థానం పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం



ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కమిటీ సభ్యులు

వింజమూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ్ల గ్రామంలో నీలగిరి పర్వతంపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన చైర్మన్, పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, సినిమా హీరో గుత్తికొండ కార్తికేయ పాల్గొన్నారు. ముందుగా ఆంజనేయస్వామికి, గణపతికి, శివునికి, లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఈవో శాంతయ్య, ఆలయ చైర్మన్‌గా లెక్కల కాంతారెడ్డి, పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం సినీహీరో కార్తికేయ మాట్లాడుతూ తిరుపతి, శ్రీశైలం, అన్నవరం తదితర ఆలయాల మాదిరిగా లక్ష్మీనరసింహస్వామి ఆలయం వెలుగొందాలని ఆకాంక్షించారు. లెక్కల చిన్నకొండారెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. అనంతరం వక్తలను పాలక మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, పోలీస్ హౌసింగ్ మాజీ చైర్మన్ చిరంజీవిరెడ్డి, మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, నాయకులు లంకినపల్లి ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ అనపరెడ్డి ప్రమీల, వింజమూరు సర్పంచ్ నల్గొండ సృజన, ఎంపీపీ మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై సీపీఐ ఆందోళన



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా తొలగించిన పింఛన్లను తిరిగి కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తొలగించిన పింఛన్లపై మరోసారి విచారణ చేసి అర్హులైన వారికి పింఛన్లు పునరుద్ధరించాలని కోరారు. అనంతరం కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం మధు, టౌన్ కార్యదర్శి జంగం నాగరాజు, జిల్లా సమితి సభ్యులు ఇండ్ల అంకమ్మ, మున్సిపల్ నాయకులు బి హజరత్, ఎం కొండయ్య, రమణయ్య మాలకొండయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న విక్రమ సింహపురి వైస్ చాన్స్‌లర్ డాక్టర్ అల్లం శ్రీనివాసరావు

సంగం, ఆగస్టు 29 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు డిగ్రీ పట్టాతో కళాశాల నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఉద్యోగం స్వీకరణ కాకుండా పలువురికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయి కి ఎదగాలని విక్రమ సింహ పురి వైస్ చాన్స్‌లర్ డాక్టర్ అల్లం శ్రీనివాసరావు సూచించారు. శుక్ర వారం ఆయన సంగంలోని నేతాజీ డిగ్రీ కళాశాలలో పీ4లో భాగంగా కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి బాలికలకు ఏర్పాటు చేసిన ఉచిత హాస్ట ల్ గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యకు పేద రికం అడ్డుకాదని, కష్ట పడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని తెలిపారు. ప్రస్తుతం యూనివర్సిటీల్లో రకరకాల కోర్సులు అందు బాటులో ఉన్నాయని, మీకు ఎందులో నైపుణ్యం ఉందో దానికి తగినట్లు కోర్సుల్లో చేరి ప్రతిభ సాధిస్తే మంచి అవకాశాలు ఉంటాయని తెలిపారు. కళాశాలల్లో ఉన్న వసతులను బట్టి కోర్సుల కోసం యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకుంటే కమిటీలు పరిశీలించి మంజూరు చేస్తారని తెలిపారు. అనంతరం సీఐ వేమారెడ్డి, ఎంపీడీవో షాలెట్, ఎస్‌ఐ రాజేష్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులు రెడ్డి, సంగం పీఏసీఎస్ చైర్మన్ గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ పట్టాభిరెడ్డి, టీడీపీ నాయకులు కాకు మధు సూదన్ యాదవ్ తదితరులు పీ4 పథకం గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి వక్తలందరినీ శాలువాలతో సత్కరించి మెమోంటోలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతిపై దృష్టి సారించాలి : ఎంపీడీవో



సీతారామపురం: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాయి ప్రసాద్

సీతారామపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పురోగతిపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని ఎంపీడీవో సాయిప్రసాద్ అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సూచిక వెర్షన్ 2.0 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫజిహా, ఎంఈఓ మస్తాన్‌వలి, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

● **వింజమూరు :** మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీరాజ్ 20 ఇండెక్స్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని పంచాయతీ సెక్రటరీలకు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రామారావు, జడ్పీటీసీ గంగం బాల కృష్ణారెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ ఆనంద్, రమణయ్య, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోమశిలలో 60.050 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి శుక్రవారం 19,496 క్యూసెక్కులు వస్తుండగా 60.050 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,500, డెల్టాకు 1,850 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

C.R.I.M.E N.E.W.S

రౌడీషీటర్లపై పోలీసుల పంజా

● డీజీపీ ఆదేశాలతో వరుస అరెస్టులు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రౌడీషీటర్లపై పోలీసులు పంజా విసురుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రౌడీషీటర్ల ఆగడాలు జిల్లాలోనే కాదు పొరుగు జిల్లాలోనూ మితిమీరిపోయాయి. ఇదే సమయంలో రౌడీషీటర్ శ్రీకాంత్, కి'లేడీ' అరుణ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవడంతో ప్రభుత్వం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే డీజీపీ, గుంటూరు రేంజ్ ఐజీ విడతలవారీగా జిల్లాకు చేరుకుని పోలీస్ అధికారులతో సమీక్షించారు. రౌడీషీటర్ల విషయంలో ఉపేక్షించవద్దని, ఏదైనా తాను చూసుకుంటానని, రాజకీయ నాయకులు సైతం రౌడీషీటర్ల కోసం ఫోన్లు చేయరని డీజీపీ అధికారులకు స్పష్టంగా తెలిపారు. దీంతో ఎస్పీ కృష్ణకాంత్ నేతృత్వంలో జిల్లావ్యాప్తంగా వారం రోజుల్లోనే 40 మంది రౌడీషీటర్లను పలు కేసుల్లో పోలీసులు అరెస్ట్ చేశారు. దర్గామిట్ట పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో ఆరుగురు రౌడీషీటర్లను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్య శుక్రవారం నిందితుల వివరాలను వెల్లడించారు. నెల్లూరు నగరానికి చెందిన వినయ్, బాలమణికంఠ, వెంకటతేజ, ఛత్రపతి, ముర్తియార్‌లు జాబితాలో ఉన్నారు. గతంలో ఓ హత్య కేసులో వీరంతా నిందితులు. వ్యసనాలకు బానిసైన వీరు గంజాయి విక్రేతలుగా మారారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి విక్రయించేందుకు తరలిస్తున్నారని దర్గామిట్ట పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో బారాషాహీద్ దర్గా సమీపంలో నిందితులను అరెస్ట్ చేసి తొమ్మిది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని జైలుకు పంపామని సీఐ తెలిపారు.

రూ. లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు

నెల్లూరు(క్రైం) ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఓ వ్యక్తిని నమ్మించి రూ.45.20 లక్షలను సైబర్ నేరగాళ్లు దోచేశారు. ఈ ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, నగరంలోని ఏకేనగర్ పోలీసు కాలనీలో ఓ వ్యక్తి నివాసం ఉంటున్నారు. ఆయన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తుంటారు. ఆయనకు గత జూలై 5న శానికగోఖ్లే అనే వ్యక్తి వాట్సాప్‌లో మెసేజ్ చేశారు. తాను ఓ ప్రొఫెసర్‌కి అసిస్టెంట్‌గా పనిచేస్తున్నానని పరిచయం చేసుకున్నారు. ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే మూడింతలు లాభాలు వస్తాయని నమ్మించాడు. దీంతో ఎనిమిది దఫాలుగా బాధితుడు రూ.45లక్షలు పెట్టారు. అప్పటి నుంచి సైబర్ నేరగాడు ఫోన్ స్విచ్ఛాప్ చేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చేజర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో మండలంలోని కండాపురం గ్రామంలో శుక్రవారం రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం మేరకు.. వినాయక చవితి సందర్భంగా గురువారం మధ్యాహ్నం జరిగిన అన్నదాన కార్యక్రమంలో రెండు కుటుంబాల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. అయితే ఆ సమయంలో అక్కడే ఉన్న గ్రామస్థులు సర్దుబాటు చేసి పంపించేశారు. అయితే శుక్రవారం ఉదయం ఒక కుటుంబానికి చెందిన వ్యక్తి నెల్లూరు నుంచి కొంతమందిని తీసుకురావడంతో గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న చేజర్ల ఎస్‌ఐ తిరుమలరావు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘర్షణలో దాసరి పవన్, దాసరి జయకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి...

వెంకటాచలం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరులోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన పవన్ కుమార్, సురేష్ ముత్తుకూరు మండలం పంటపాళెం వద్ద ఉన్న ఆయిల్ ఫ్యాక్టరీలో విధులు ముగించుకుని మోటర్ బైకుపై నెల్లూరుకు వస్తుండగా సర్వేపల్లి రైల్వే గేటు వద్ద బైక్‌ను ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఓ ఓ ప్రైవేటు క్లినిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్పంచు చెక్ పవర్ రద్దు

చేజర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు పూర్తి విచారణ అనంతరం చేజర్ల మండలం ఏటూరు గ్రామ పంచాయతీకి చెందిన వైసిపి సర్పంచ్ వై నాగభూషణమ్మకు 6 నెలల పాటు చెక్‌పవర్ రద్దుచేస్తూ జిల్లా పంచాయతీ అధికారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఏటూరు గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రామంలో డివిజనల్ పంచాయతీ అధికారి విచారించి తుది నివేదికను జూలై 28వ తేదీన జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించారు. ఈ నివేదికలో సాధారణ నిధులు రూ.8,73,381, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14,62,938 అభ్యంతరకరమైన రీతిలో ఖర్చు చేయటంతో పాటు 44 వేల రూపాయల నిధులు దుర్వినియోగం చేయడంతో వివరణ కోరుతూ గ్రామ సర్పంచ్‌కి షోకాజు నోటీసును జారీ చేశారు. అయితే సర్పంచ్ ఎటువంటి సంజాయిషీ ఇవ్వకపోవడంతో జిల్లా పంచాయతీ అధికారి సర్పంచ్ వై నాగభూషణమ్మకు 6 నెలల పాటు చెక్‌పవర్ రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.12కే కిలో ఉల్లి

● రైతుబజార్లలో అమ్మకాలు

● జిల్లాకు 5టన్నుల దిగుమతి



నవాబుపేట రైతుబజారులో ఉల్లిపాయల బస్తాలు

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల కోసం రైతు బజార్లలో కిలో ఉల్లిపాయలు రూ.12లకు విక్రయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు నుంచి శుక్రవారం 5 టన్నుల ఉల్లిపాయలను జిల్లాకు దిగుమతి చేసుకున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత తెలిపారు. కావలి, కందుకూరు రైతుబజార్లకు ఒకటిన్నర టన్నుల చొప్పున, నెల్లూరులోని నవాబుపేట, ఫత్తేఖాన్‌పేట రైతుబజార్లకు టన్ను చొప్పున రెండు టన్నులు కేటాయించారు. కావలి, కందుకూరులలో శుక్రవారం సాయంత్రమే ఉల్లిపాయలు విక్రయించగా, నెల్లూరులో శనివారం నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఏడీ తెలిపారు. పొదలకూరు రైతుబజారుకు మాత్రం మరో విడతలో పంపించే అవకాశం ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 560

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డెంగ్యూ, చికున్‌గున్యా లాంటి ప్రమాదకర జ్వరాలు వ్యాపించకుండా పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కె.అనూష కోరారు. శుక్రవారం 17వ సచివాలయం పరిధిలో నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. గృహ సముదాయాల పరిసరాల్లో ఉండే ఉపయోగంలో లేని వస్తువులలో వర్షపునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాడి పడేసిన కొబ్బరి బోండాలు, ఉపయోగంలో లేని కూలర్లలో నిలిచి ఉన్న నీరు, టైర్లు, తొట్టెలు, కుండీలలో వర్షపునీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త డబ్బాలు..!

● చెల్లాచెదురు చేస్తున్న పందులు ● దుర్వాసన, అపరిశుభ్రతతో ప్రజల అవస్థ



రోడ్డుపై పెట్టిన చెత్త డబ్బాల్లో చెత్తను చెల్లాచెదురు చేస్తున్న పందులు

కావలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో ఎక్కడా రోడ్లపై చెత్తా చెదారం కుప్పలు కనిపించకుండా మున్సిపల్ అధికారులు చేపట్టిన వినూత్న పథకానికి అక్కడక్కడ కొందరు సిబ్బంది తూట్లు పొడుస్తున్నారు. ఆర్వోబీ వంతెన పక్కన రోడ్డుపై పెట్టిన చెత్త డబ్బాలను పందులు కింద పడేసి చెల్లా చెదరం చేయడం తరచూ జరిగే పనే. వాస్తవంగా అక్కడ చెత్త చెల్లా చెదారం చేయటమే కాక ఆ చెత్త కోసం వాటి డబ్బాలను కింద పడేసి దానిలో ఉన్న చెత్తను బయటకు లాగుతుండటంతో ప్లాస్టిక్‌తో కూడిన ఆ డబ్బాలు కూడా పగిలి పాడై పోతున్నాయి. గతంలో మున్సిపాల్టీలో ఉన్న చెత్త డంపర్ బిన్‌లను తొలగించి అక్కడక్కడ ఐరన్ మెస్‌లతో తయారు చేసిన బాక్స్‌లను పెట్టారు. చెత్తతో నిండిన ఆ డబ్బాలను అందుబాటులో ఉన్న చెత్త వాహనాలకు ఇవ్వడం, అవి అందుబాటులో లేకపోతే ఐరన్ మెస్‌తో తయారు చేసిన బాక్స్‌లలో పెట్టి తలుపులు వేస్తే చెత్త ట్రాక్టర్లు వచ్చి ఆ డబ్బాలలో ఉన్న చెత్తను తీసుకెళ్లి తిరిగి ఆ డబ్బాలను ఐరన్ బాక్స్‌లలో పెట్టేవారు. దీంతో పట్టణంలో చెత్త కుప్పలు కనిపించకుండా ఉండేవి. అయితే కొందరు దానికి తూట్లు పొడుస్తూ చెత్త డబ్బాలను రోడ్డుపై పెట్టి వెళుతుండటంతో చెత్త ట్రాక్టర్ వచ్చి వాటిని తీసుకు వెళ్లే లోపు వాటిని పందులు చెల్లా చెదురు చేస్తున్నాయి. దీంతో అపరిశుభ్రతతోపాటు దుర్వాసన వెదజల్లుతుండడంతో ఆ ప్రాంత ప్రజలు, ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గంగమ్మ చెంతకు గణనాథులు



కావలిరూరల్ : వినాయక విగ్రహాలను నిమజ్జనానికి మోసుకెళుతున్న భక్తులు



కొండాపురం : భీమవరప్పాడులో జరుగుతున్న గణనాథుడి గ్రామోత్సవం



కలిగిరి : గణేశుని నిమజ్జనంలో మహిళల సందడి

కావలిరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో మూడవ రోజైన శుక్రవారం గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వినాయక మండపాల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాలు, లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. ముసునూరులోని మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో లడ్డూను ముసునూరు కమ్మపాలెంకు చెందిన తల్లపనేని మోహన్ రూ. 53,000లకు వేలంలో దక్కించుకున్నారు. అనంతరం వాహనాలల్లో స్వామివారిని ఉంచి ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం తీరప్రాంతాల్లో గంగమ్మ చెంతకు గణపయ్యలను చేర్చి నిమజ్జనం చేశారు. సముద్రం కసురుమీద ఉండటం తో నిమజ్జనం అనంతరం కొద్దిసేపటికే కొన్ని విగ్రహాలు తీరానికి కొట్టుకు వచ్చాయి. విగ్రహాల నిమజ్జనానికి పెద్దఎత్తున ప్రజలు తరలివస్తుండటంతో డీఎస్పీ శ్రీధర్ ఆదేశాలతో రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్‌ఐలు, మెరైన్ పోలీసులు తీరం వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహిస్తూ డ్రోన్‌తో నిఘా ఉంచారు. మండలంలోని చెన్నాయపాలెం సముద్రతీరంలో వినాయక నిమజ్జనం అనంతరం సముద్రంలో మునుగుతుండగా జలదంకి మండలం జమ్మలపాలెంకు చెందిన ఆలూరి మహేష్ అలల తాకిడికి సముద్రం లోపలికి కొట్టుకు పోయాడు. మహేష్ బంధువులు గుర్తించి పెద్దగా కేకలు వెయ్యడంతో అక్కడ గస్తీ నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు ఆవుల రమేష్, అక్కిలిగుంట మాల్యాద్రిలు లైఫ్ జాకెట్లతో సముద్రంలోకి వెళ్లి నీటిలో కొట్టుకు పోతున్న మహేష్‌ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెంకు చెందిన గణేష్ విగ్రహంతో నిమజ్జనానికి వెళ్లే ట్రాక్టర్ కావలి ఆర్వోబీ ఎక్కే సమయంలో వంతెన దిమ్మెను ఢీకొంది. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదాలు లేక పోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అట్టహాసంగా నిమజ్జనం

● **కొండాపురం** : వినాయకచవితి సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న గణనాథుల విగ్రహాలకు శుక్రవారం నిమజ్జన కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. 3వరోజు బీమవరప్పాడు, గుడవళ్లూరు, తూర్పుఎర్రబల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నిమజ్జనం కొరకు సమీప చెరువలకు తరలించారు. భక్తులు చిన్నా పెద్దా తేడాలేకుండా అనందోత్సవాలలో మునిగిపోయారు.

భక్తులకు అన్నదానం

● **అల్లూరు** : వినాయకచవితిని పురస్కరించుకొని మూడు రోజైన శుక్రవారం అల్లూరు పట్టణ పరిధిలోని అన్నదాతవారి వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వెయ్యి మందికి అన్నదానం చేశారు. ముందుగా స్వామికి ప్రత్యేక ప్రసాదాలతో నైవేద్యాలను సమర్పించారు.

మహిళల సందడి

● **కలిగిరి:** మూడు రోజులుగా భక్తుల పూజలందుకున్న గణనాథులు శుక్రవారం నిమజ్జనానికి తరలి వెళ్లారు. వినాయక మండపాల వద్ద స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూను భక్తులు వేలంలో పోటాపోటీగా తలపడి కైవసం చేసుకున్నారు. కలిగిరి పంచాయతీ పరిధిలోని పాపనముసిలిపాలెంలో పాపన హజరత్‌రెడ్డి రూ.41 వేలకు వేలంలో పాటపాడి లడ్డూను దక్కించుకున్నారు. మండపాల నుంచి వినాయక విగ్రహాలను మేళతాళాలు, తప్పెట్ల మోతల నడుమ రంగులు చల్లుకుంటూ, డీజేల మోతలతో గ్రామోత్సవం అనంతరం స్థానికంగా ఉన్న ఉత్తరకాలువతో పాటు కావలికి సమీపంలోని తుమ్మలపెంట సముద్రతీరానికి తీసుకెళ్లి నిమజ్జనం గావించారు.

బొజ్జగణపయ్య గ్రామోత్సవం

● **జలదంకి** : వినాయక ఉత్సావాల్లో భాగంగా మూడో రోజు మండలంలోని పలుగ్రామాల్లో బొజ్జగణపయ్యల నిమజ్జన కార్యక్రమం ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకున్నారు. కొన్ని గ్రామాల్లో స్థానిక నీటివనరుల్లో గణనాథులను నిమజ్జనం చేయగా మరికొందరు కావలి మండలంలోని సముద్రతీర ప్రాంతాలకు తరలించారు.



జలదంకి : గ్రామోత్సవంలో బొజ్జగణపయ్య



లింగసముద్రం : గణనాథుని ఊరేగింపులో చిందులు వేస్తున్న యువకులు



అల్లూరు : అన్నదాతవారివీధిలో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

భక్తిశ్రద్ధలతో..

● **లింగసముద్రం** : మండలంలోని లింగసముద్రం, తిమ్మారెడ్డిపాలెం, పెదపవని, చినపవని, మేదరమెట్ల పాలెం గ్రామాలలో వినాయకుడి విగ్రహాలను వైభవం గా నిమజ్జనం చేశారు. రాత్రి 10 గంటలు దాటిన తరు వాత, రాళ్లపాడు ప్రాజెక్టు కొత్త స్పిల్‌వే గైడ్‌బండ్‌లో, ఉప్పుటేరులో, స్థానిక చెరువులలో గణనాధుని విగ్రహా లను నిమజ్జనం చేశారు.

సముద్రతీరంలో ఉత్సాహంగా...

● **బిట్రగుంట:** బోగోలు మండలంలోని విశ్వనాథరావుపేట పంచాయతీ నుంచి దాదాపు 16 విగ్రహాలు శుక్రవారం తాటిచెట్లపాలెం సముద్రతీరానికి చేరాయి. స్థానిక ఎస్‌ఐ ప్రభాకర్‌రావు, అల్లూరు ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి, పోలీస్ సిబ్బంది, మెరైన్ పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జనం చేశారు. ఇతర మండలాల నుంచి దాదాపు 70 వినాయక విగ్రహాలు సముద్రంలో నిమజ్జనానికి వచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. వందలాది మంది భక్తులు సముద్రస్నానాలు ఆచరించారు.



బిట్రగుంట : గణేశ్ నిమజ్జనానికి వచ్చి సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు



చివరికి తీరానికి చేరి.. కావలి రూరల్ : సముద్రంలో ముంచిన ప్రతిమలు తిరిగి ఒడ్డుకు చేరిన దృశ్యం

ప్రత్యేక ఆకర్షణగా గణనాథులు

● **కందుకూరు** : గణేశ్ నవరాత్రి ఉత్సవాల కోసం కందుకూరు పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలు స్తున్నాయి. పట్టణంలోని వాసవీ నగర్ కాలనీ, పోస్టాఫీసు సెంటర్‌లోని దేవుడు అరుగుల వద్ద పర్యావరణ హిత మట్టి గణపతి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అత్తంటివారిపాలెంలో ఏర్పాటు చేసిన మహాశివగణేశుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కందుకూరు : పోస్టాఫీసు సెంటర్‌లో ఏర్పాటు చేసిన మట్టిగణపతి విగ్రహం

వైభవంగా వినాయకుడి నిమజ్జనం

● **ఉలవపాడు** : మండలంలో వినాయకుడి విగ్రహాల నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లో నెలకొల్పిన గణేష్‌ని విగ్రహాలను కోలాహలంగా, డీజే, డప్పు వాయిద్యాలు, రంగులు చల్లుకుంటు నృత్య ప్రదర్శలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెం, రామాయాపట్నం, కరేడు, చాకిచర్ల, పెద్దపట్టపుపాలెం సముద్రంలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు, మెరైన్ పోలీసులు చర్యలు చేపట్టారు.

'రాళ్లపాడు'లో నిమజ్జనం చేయొద్దు

లింగసముద్రం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయవద్దని ప్రాజెక్టు డీఈఈ ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాళ్లపాడు ప్రాజెక్టు పరిసర గ్రామాల ప్రజలు ఎప్పటిలాగే ప్రతి ఏటా ప్రాజెక్టు కొత్త స్పిల్‌వే ముందు భాగంలోని గైడ్‌బండ్‌లో నిమజ్జనం చేసుకోవాలని పేర్కొన్నారు. అయితే రాళ్లపాడు ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వలు బాగా తగ్గినందు వలన వినాయకస్వామి విగ్రహాలను ఇందులో నిమజ్జనం చేస్తే మంచినీటిలో విగ్రహాల రసాయనాలు కలిసి నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్టు లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ముగ్గురు లస్కర్లను నియమించినట్లు తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కావలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక విట్స్ కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల విద్యార్థిని, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఈ కార్యక్రమంలో విట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.అనిల్‌కుమార్, డాక్టర్ రజ్వీ, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ గిరీష్ గాంధీ, పీడీ భాస్కర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

వలేటివారిపాలెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : సిమెంట్ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని కళవళ్లలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం కళవళ్ల, నలదలపూరు, శాఖవరం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. బడేవారిపాలెం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్‌సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మిగిలి ఉన్న ప్లాట్లకు త్వరలో లాటరీ

● ఎంఐజీ లేఅవుట్‌ను పరిశీలించిన జేసీ



జమ్మలపాలెం నుడా ఎంఐజీ లేఅవుట్‌లో పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

జలదంకి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలపాలెంలోని ఎన్టీఆర్ స్మార్ట్ సిటీ ఎంఐజీ లేఅవుట్‌లో మిగిలి ఉన్న ప్లాట్లకు త్వరలో లాటరీ విధానం ద్వారా వేలం వేస్తామని నుడా వైస్‌చైర్మన్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. కొందరు ప్లాట్ల యజమానులు మౌలిక వసతులు కల్పించలేదని ఫిర్యాదు చేయగా శుక్రవారం ఆయన నుడా అధికారులతో కలసి ఎంఐజీ లేఅవుట్‌ను, బ్రోచర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా నుడా ఈఈ చంద్రయ్యతో మౌలికవసతులపై చర్చించారు. మిగిలి ఉన్న మౌలికవసతులు ఎందుకు చేపట్టలేదని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి ఎంబుక్‌లు తన ముందుంచాలని తెలిపారు. అలాగే కేటాయించని ప్లాట్ల వివరాలపై ఆరా తీశారు. లేఅవుట్‌కు సమీపంలోని భూముల వివరాలను తహసీల్దారు ప్రమీలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 27 ఎకరాల భూముల వివరాలు తహసీల్దారు తెలియజేయగా వీటిలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల గురించి ఆరాతీశారు. అనంతరం జేసీ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మిగిలిపోయిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయిస్తామన్నారు. అవసరమైతే చుట్టుపక్కల భూములు సేకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పెంచలరెడ్డి, ఎస్టేట్ అధికారి డానియేలు పీటర్, ఆర్ఐ నరిసింహరావు, వీఆర్వో గిరిధర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరురోడ్డులో లైన్‌వర్క్ ఉన్నందున ఉదయం ఆరున్నర నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. పామూరురోడ్డు ఫీడర్ పరిధిలోని కొత్త కుమ్మరిపాలెం, ప్రశాంతినగర్, సింహాద్రినగర్, ఎర్రవడ్డిపాలెం, పామూరుబస్టాండ్ ఏరియా, వెంకటేశ్వరనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

కావలి రైతు బజారులో కిలో ఉల్లి రూ.12



రైతు బజారులో ఉల్లి పాయలు అందచేస్తున్న మధుబాబు

కావలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కావలి రైతు బజారులో కిలో ఉల్లిపాయలు రూ.12లకే ప్రభుత్వం అందచేస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతు బజారు ఎస్టేట్ అధికారి మధుబాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు ఉల్లి అమ్మకాలను రైతు బజారులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన ఉల్లి పాయాలను తక్కువ ధరకు అందిం చాలనే ధృడసం కల్పంతో రైతు బజారులలో విక్రయాలు ప్రారంబించిం దన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు

కావలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లలకు అవసరమైన వారికి ఉచితంగా ఉపకరణాలు అందజేస్తామని ఎంఈవోలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్యలు తెలిపారు. కావలి భవిత పాఠశాల పిల్లలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. భవిత పాఠశాల పిల్లల విజయగాధను వారి తల్లిదండ్రుల ద్వారా తెలుసుకుని సంతోషించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో పెంచలయ్య, ఇన్‌చార్జి కోఆర్డి నేటర్ ప్రసాద్, జలదంకి ఎంఈవో పద్మనాభం, హెచ్‌ఎం మాధవ్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణకు సత్కారం



హెచ్‌ఎం రమణను అభినందిస్తున్న డిప్యూటీ ఈవో హరిప్రసాద్

కావలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాయపాలెం జిల్లా పరిషత్ గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడు పాతూరి వెంకటరమణ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఆ పాఠశాలలో జరిగింది. ఉపాధ్యాయుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కావలి ఉపవిద్యాశాఖాధికారి ఎం. హరిప్రసాద్ మండల విద్యాశాఖ అధికారులు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య, సర్వాయపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చాగంటి మురళి, తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న వెంకటరమణ దంపతులను సత్కరించారు.

టీఆర్‌ఆర్‌లో మెగా జాబ్‌మేళా

కందుకూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ సౌజన్యంతో నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 268 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకాగా 15 ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి 126 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నాయి. మరో 32 మందికి వెయిటింగ్ లిస్టులో ఆఫర్‌లెటర్స్ అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు విశేషస్పందన లభించిందని, ఎంపికైన వారిలో 53 మంది తమ కళాశాల విద్యార్థులు ఉండడం తమకెంతో సంతోషదాయకమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఎస్‌డీసీ అధికారి ఓ.జనార్దన్, సీడ్ ఆఫ్ ట్రైనర్ సీహెచ్ శ్రీనివాసరావు, కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటరు పీ.రాజగోపాలబాబు, వైస్‌ప్రిన్సిపాల్ ఏడుకొండలు నరేంద్ర, కె.సుజాత, ఎస్వీ శ్రీహరి, తిరుపతిస్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఉలవపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగొల్లు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు చెప్పిన వివారాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి చెన్నైకు కారులో వెళుతున్న తండ్రి కొడుకులు రత్నవేలు, ఆర్ గాంధీ మార్గమధ్యలో చాగొల్లు వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఇద్దరిని కారులో నుంచి బయటకు తీశారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంకమ్మ తెలిపారు.

వైసీపీ చలో కావలిపై పోలీసు నిఘా

కావలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ చలో కావలిపై పోలీసు నిఘా ఉంచారు. భద్రతను పెంచి విస్తృత తనిఖీలు చేపట్టారు. వైసీపీ శ్రేణులను మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీనిపై వైసీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిపై హత్యాయత్నంకు ప్రయత్నించారనే ఫిర్యాదు మేరకు కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మరో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దానిపై వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు కావలికి వచ్చి ఎమ్మెల్యేపై ధ్వజమెత్తారు. వెంటే ఎమ్మెల్యే నెల్లూరు వెళ్లి కాకాణి, పర్వతరెడ్డిలపై ఘాటైన విమర్శలు చేశారు. ఆ తర్వాత నెల్లూరు, కావలిలో టీడీపీ, వైసీపీ శ్రేణులు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి వైసీపీ జోనల్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు తదితరులు మందీమార్బలంతో కావలికి వచ్చేందుకు చలో కావలి కార్యక్రమానికి పిలుపు నిచ్చారు. ఈ విషయంపై అప్రమత్తమైన పోలీసులు చలో కావలిని అడ్డుకునేందుకు సుమారు 100 మంది పోలీసు బలగాలతో ఉదయం 9గంటల నుంచి మాజీ ఎమ్మెల్యే ఇంటి పరిసరాలలో నిఘా ఏర్పాటు చేశారు. కావలి-ముసునూరు రోడ్డులో ఉన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఇంటికి ఎవరూ రాకుండా అడ్డుకునేందుకు ట్రంకు రోడ్డులో బారికేడ్లు అడ్డుపెట్టి తనిఖీలు నిర్వహించారు. నెల్లూరు వైపు నుంచి వచ్చే వాహనాలను కూడా టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టారు. అలాగే కావలికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని పోలీసలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు పోలీసులతో వాగ్వివాదానికి దిగి వారి తీరుపై విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యేతోపాటు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. చివరకు వారిని అడ్డుకుని అక్కడ నుంచి వెనుకకు పంపారు. మొత్తం మీద నెల్లూరులోనే నేతలను హౌస్ అరెస్ట్ చేయడంతో వారు రావడం లేదని తెలిసి కావలి వైసీపీ నేతలు అక్కడి నుంచి నిష్క్రమించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

బిట్రగుంట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం పోటీలు నిర్వహించారు. మేరా యువభారత్ నెల్లూరు, అక్షయ ఉమెన్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయింతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలురు విభాగంలో వాలీబాల్, కబడ్డీ, బాలికలకు ఖోఖో, రింగ్‌బాల్ తదితర క్రీడా పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సెట్నల్ అధికారి శ్రీనివాసులు, జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాలశైలజ, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఐటీ విభాగం జిల్లా ఎగ్జిక్యూటీవ్ సభ్యుడిగా మాల్యాద్రి

లింగసముద్రం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐటీ విభాగం జిల్లా ఎగ్జిక్యూటీవ్ సభ్యుడిగా లింగసముద్రం పంచాయతీ జంపాలవారిపాలెంకు చెందిన మట్టె మాల్యాద్రిని నియమించారు. ఈ మేరకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు మాల్యాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, వైసీపీ మండల అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరెడ్డి, ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, మట్టె వేణుగోపాల్, షేక్ షఫి, పి తిరుపతిరెడ్డి, తదితరులకు ఆయన కృతజ్ఞలు తెలిపారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 30 ఆగస్టు 2025

● తెలుగు భాషా దినోత్సవం



తెలుగు పండితులను సత్కరిస్తున్న జేసీ శుభం బన్సల్

వాడుక భాషకోసం ఉద్యమించారు. తెలుగు భాష ఔన్నత్యానికి కృషి చేశారు గిడుగు వెంకటరామమూర్తి. అందుకే ఆయన పుట్టిన రోజును తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకొంటున్నారు.

ఒలింపిక్స్‌లో మూడుసార్లు స్వర్ణ పతకాలను సాధించడంలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ కీలక పాత్ర పోషించారు. అందుకే ఆయన జన్మదినాన్ని క్రీడా దినోత్సవంగా జరుపుకొంటారు.

ఈ ఇద్దరి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా తెలుగు భాషా.. క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

● జాతీయ క్రీడా దినోత్సవం



ధ్యాన్‌చంద్ విగ్రహం వద్ద అధికారులు, హాకీ క్రీడాకారులు

‘తెలుగు’ ఔన్నత్యాన్ని తెలుసుకోండి

‘తెలుగు భాష ఔన్నత్యాన్ని గుర్తించండి. ప్రాముఖ్యతను తెలుసుకోండి. తెలుగు భాషపై మక్కువ చూపండి’ అంటూ పిల్లలకు జేసీ శుభం బన్సల్ పిలుపునిచ్చారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శుక్రవారం తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. గిడుగు వెంకటరామమూర్తి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి అధికారులు నివాళులర్పించారు. గ్రాంధిక భాష వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్న రోజుల్లో.. వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు శ్రీకారం చుట్టారని జేసీ గుర్తుచేసుకున్నారు. ‘ఇంగ్లిష్ మాధ్యమంతో తెలుగు మాట్లాడటం అరుదుగా మారింది. పిల్లలూ తెలుగులో చదవండి. రాయండి. మాట్లాడండి. ప్రతిరోజూ తెలుగు పత్రికలు చదవండి. వేమన, సుమతి శతకాలను అవగాహన చేసుకోండి’ అని డీఆర్వో నరసింహులు కోరారు. తెలుగుభాషకు సేవ చేస్తున్న పండితులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీలు శివశంకరనాయక్, రోజ్మాండ్, పర్యాటకశాఖ జిల్లా అధికారి జనార్దన్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

– తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

నచ్చిన ఆట ఆడండి

‘ఆధునిక క్రీడలతో పాటు ప్రాచీన భారతీయ ఆటల్లో మీకు నచ్చినవి ఆడండి. దీనివల్ల మానసిక ఉల్లాసం కలుగుతుంది. మేధస్సు చురుగ్గా ఉంటుంది. చదువులో చురుగ్గా రాణిస్తారు’ అంటూ పలువురు పిలుపునిచ్చారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఆయన విగ్రహానికి గజమాల వేశారు. క్రీడాకారులు హాకీ స్టిక్స్‌ను ప్రదర్శిస్తూ నివాళులర్పించారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించిన వారికి డీఎస్‌డీవో, సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వై.ప్రవీణ్, ఆర్.శ్రీధర్, ప్రతినిధులు సాయికుమార్, విజయ్‌కుమార్, శివప్రసాద్, శాప్ కోచ్‌లు గోపి, వినోద్, హిందుజ, సాయిసుమతి, ఆది, హరి, ప్రేమ్‌నాథ్, త్వైక్వాండో, ఫుట్‌బాల్, బాక్సింగ్ అసోసియేషన్ల తరపున గోపీనాయుడు, రెడ్డెప్ప, కైలాష్ పాల్గొని ధ్యాన్‌చంద్ సేవలను స్మరించుకున్నారు. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారులు జాతీయ జెండాను ప్రదర్శించారు.

– తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి



గుడుపల్లె సమీపంలో నిండుగా ప్రవహిస్తున్న హంద్రీ-నీవా కాలువ

బాబు భగీరథ ప్రయత్నం

ఫలించిన వేళ!

● పరుగులు పెట్టి కుప్పం చేరుకున్న కృష్ణమ్మ

కుప్పం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎక్కడి శ్రీశైలం.. ఎక్కడి కుప్పం? మధ్యలో 738 కిలోమీటర్ల దూరం. ప్రతిపక్ష వైసీపీ పాలనలో మధ్యలో అయిదేళ్ల నిర్లక్ష్యం. ఈ అయిదేళ్లకు అటు అయిదేళ్లు, ఇటు ఏడాది.. ఆరేళ్లపాటు సాగిన చంద్రబాబు భగీరథ ప్రయత్నం. హంద్రీ - నీవా బ్రాంచి కాలువ రూపంలో ముఖ్యమంత్రి సంకల్పం సాకారమైంది. కృష్ణమ్మ పరుగులు పెట్టి వచ్చి కరువు నేల కుప్పాన్ని పావనం చేస్తోంది. గత నెల 17వ తేదీన కర్నూలు జిల్లా మల్యాల ఎత్తిపోతల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీ-నీవా కాలువలోకి నీటిని విడుదల చేశారు. ఆ నీళ్లు 738 కిలోమీటర్లు ప్రయాణించి ఈనెల 23వ తేదీ అర్ధరాత్రి రామకుప్పం మండలం వర్తికుప్పం వద్ద కుప్పం నియోజకవర్గంలో ప్రవేశించాయి. కుప్పం మండలంలోని గమ్యస్థానమైన పరమసముద్రం చెరువుకు 25వ తేదీన కృష్ణా జలాలు చేరుకున్నాయి. వీటితో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని 8 మండలాల పరిధిలో ఉన్న 110 చెరువులు నింపనున్నారు. తద్వారా 6,300 ఎకరాలకు సాగు.. 4.02 లక్షలమందికి తాగునీరు అందనుంది. కాగా, కుప్పం మండలం పరమసముద్రం చెరువు సమీపంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం జలహారతి ఇవ్వనున్నారు. అక్కడే పైలాన్ ఆవిష్కరించి, బహిరంగ సభలో నియోజకవర్గ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. దీనికోసం ఆయన శుక్రవారం సాయంత్రం కుప్పం చేరుకున్నారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు

ఏకదంతుడి రూపాలెన్నో!




సింగాలగుంట: ఉయ్యాలలో..



పడవలో కృష్ణుని తీసుకెళుతూ..



పల్లెవీధి: బాల వినాయకుడు



కొత్తవీధి: ఆంజనేయస్వామి రూపంలో..

ఎందరో దేవతామూర్తుల రూపంలో తిరుపతి నగర కూడళ్లలో వినాయకులు కొలువుదీరారు. డ్రమ్స్ వాయిద్య కారుడిలా.. చీరలు.. రాగి కలశాలు.. ఇలా ఎవరికి నచ్చినట్లు వారు గణేశుడి ప్రతిమలను విభిన్నంగా తీర్చిదిద్దారు. ఎంతో ఆకర్షణీయంగా ఉన్న ఏకదంతుడి ప్రతిమలను శుక్రవారం కూడా స్థానికులు సందర్శించి.. మొక్కులు తీర్చుకున్నారు.

– తిరుపతి, ఆంధ్రజ్యోతి



జ్యోతి థియేటర్ రోడ్డులో..



డీఆర్ మహల్‌రోడ్డు: శారీ గణపతి



మంచినీళ్లగుంట: కాళికామాత రూపుదై..

ఊటగుంట: రాగి కలశాలతో వినాయకుడు

అన్నారావు సర్కిల్: ‘డ్రమ్స్’ గణేశ



అప్పీలు చేసుకున్న వారికి ఒకటిన పింఛను

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అనారోగ్య, దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి నోటీసులు అందుకున్న వారందరూ శనివారం సాయంత్రం లోపు అప్పీల్ చేసుకోవాలని, అలాంటి వారికి మాత్రమే సెప్టెంబరు ఒకటో తేదీన పింఛను ఇస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం తెలిపారు. టెలీ కాన్ఫరెన్సు ద్వారా అధికారులతో మాట్లాడుతూ పింఛన్ల రీ వెరిఫికేషన్‌లో భాగంగా నోటీసులు అందుకున్న దివ్యాంగులు అప్పీల్ చేసుకోవాలని, వారికి అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. అప్పీల్ చేసుకోకపోతే పింఛను రాదని స్పష్టం చేశారు. ఇక ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు సెప్టెంబరు నెలకు సంబంధించి 2,63,350మంది లబ్ధిదారులకు రూ.112.36కోట్లు నిధులు కేటాయించినట్లు చెప్పారు. సోమవారం ఉదయం నుంచే అందజేయాలని అధికారులను ఆదేశించారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని, పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులను దారి మళ్లించిందని గుర్తు చేశారు. తద్వారా గ్రామాల్లో సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందిపడ్డారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు సెప్టెంబరులో విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం చెప్పిందని, అదే జరిగితే గ్రామ పంచాయతీలు మరింతగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ నిధులు, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీల గౌరవ వేతనాలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చెంపుల సత్యనారాయణరెడ్డి, సర్పంచుల సంఘం తెలంగాణ గౌరవాధ్యక్షుడు నరేంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో సౌకర్యాలు కల్పిస్తే పర్యావరణ హితానికి తోడ్పాటు అందించిన వారమవుతామన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, వేణుగోపాల్, మురళి, అనిల్ పాల్గొన్నారు.

తిరుపతిలో పోలీస్ బాస్‌లు

● సమన్వయ కమిటీ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాల ఉన్నతాధికారుల రాక

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలోని మూడు రాష్ట్రాల డీజీపీలు. ఐదు రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఉన్నతస్థాయి పోలీసు అధికారులు. ఇలా 48 మంది ఉన్నతాధికారులతోపాటు బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, సీబీఐ, ఎన్ఐఏ, ఎన్‌సీబీ అధికారులు తిరుపతిలో సమావేశమయ్యారు. ఆయా రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం, అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర దొంగలను కట్టడి చేయడం, సైబర్ నేరాలు, మహిళా ట్రాఫికింగ్, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే అంశాలపై నిఘా ఉంచడం, డ్రగ్స్ ముఠా ఆట కట్టించడం, సమాచార మార్పిడి తదితర విషయాలపై దాదాపు ఎనిమిది గంటల పాటు చర్చించారు. తమకు ఎదురైన సవాళ్లను ఎదుర్కొనడానికి అన్ని రాష్ట్రాలు కలిసి తీసుకోవాల్సిన చర్యలను ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వివరించారు. కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇంతమంది పోలీసు ఉన్నతాధికారులు రావడంతో గ్రాండ్ రిడ్జ్ వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. తనిఖీలు ముమ్మరం చేశారు. వాహనాలను దారి మళ్లించారు. కొందరు పోలీసు అధికారులు గురువారం రాత్రే తిరుపతికి చేరుకున్నారు. వీరిలో కొందరు తిరుమల వెళ్లి శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని సమావేశానికి వచ్చారు. మరికొందరు శనివారం శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ సమావేశానికి హాజరైన వారి కోసం ఎస్పీ హర్షవర్ధనరాజు ఆధ్వర్యంలో అధికారులు బస, భోజనం, సమావేశ ఏర్పాట్లు పక్కాగా చేశారు. ఈ సమావేశంలో ఏపీ డీజీపీతో పాటు కేరళ డీజీపీ రావాడ చంద్రశేఖర్, పుదుచ్చేరి డీజీపీ శాలిని సింగ్, ఎనిమిది మంది అదనపు డీజీలు, 9 మంది ఐజీలు, 12 మంది డీఐజీలు, 16 మంది ఎస్పీలు, కేంద్ర భద్రత బలగాల వింగ్‌ల నుంచీ అధికారులు హాజరయ్యారు.



సమావేశానికి వస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



నేడు తిరుపతి-కాచిగూడ మధ్య ప్రత్యేక రైలు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి-కాచిగూడ మధ్య ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు. కాచిగూడలో శుక్రవారం రాత్రి ఈ ప్రత్యేక రైలు(02794) బయలుదేరి శనివారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకుంటుంది. తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(02793) శనివారం రాత్రి 9.10 గంటలకు బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, తాడిపత్రి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, కృష్ణ, యాద్‌గిర్, సేదం, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్ మీదుగా కాచిగూడకు మరుసటి రోజు ఉదయం 11 గంటలకు చేరుకుంటుందని తెలిపారు.





తిరుమలేశుడి సేవలో ఐశ్వర్యా రాజేష్

సినీ హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లి మూలమూర్తిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల ఆమెను పలువురు సినీ అభిమానులు ఆసక్తిగా చూశారు. కొందరు సెల్ఫీలు దిగారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మే 15 కటాఫ్‌తో డీఎస్సీ అర్హత నిర్ణయించడం సరికాదు : ఆపస్

తిరుపతి(విద్య), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల విద్యార్హత సర్టిఫికెట్లు మే 15 తర్వాత జారీ అయ్యాయనే కారణంతో వారిని అనర్హులుగా నిర్ణయించడం ఎంతమాత్రమూ సరికాదని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వ డీఎస్సీ ప్రకటన ప్రకారం మే 15వ తేదీకి ముందే పరీక్షలు రాసి, ఫలితాలు వెల్లడైన విద్యార్థులే దరఖాస్తు చేసుకున్నారని, అయితే వారికి మే 15 తరువాత సర్టిఫికెట్లు జారీ అయ్యాయని వివరించారు. ప్రభుత్వం స్పందించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నాటికి అర్హత కలిగిన వారందరికీ పోస్టింగులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చాలామంది అభ్యర్థులకు కాల్ లెటర్స్ అందలేదని, అందువల్ల ఎవరు ఏరోజున వెరిఫికేషన్‌కు రావాలో తెలియడం లేదని పేర్కొన్నారు. పోస్టింగులు ఇవ్వడానికి ముందే ప్రతి జిల్లాలో సబ్జెక్టు వారీగా రోస్టర్ కమ్ మెరిట్‌లో అభ్యర్థులకు సంబంధించిన మార్కులు రిజర్వేషన్ కేటగిరీ తెలిసేలా ఫైనల్ సెలెక్షన్ లిస్టులు ప్రకటించాలని కోరారు. అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయడానికి హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 63,843

తలనీలాలు సమర్పించినవారు: 21,344



మరింత సమర్థంగా వ్యర్థాల నిర్వహణ

ఆదేశించిన టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఘన వ్యర్థాల నిర్వహణపై టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులతో సమీక్షించారు. అన్నమయ్య భవనంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఇతర అధికారులతో కలిసి ఈఅంశంపై చర్చించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. తిరుమలలోని తడి చెత్త ద్వారా బయోగ్యాస్, ఎరువులు తయారీకి టీటీడీ-ఐఓసీఎల్ భాగస్వామ్యంతో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. విభజన అవసరం లేకుండా వ్యర్థాల నిర్వహణ సమర్థ అమలుకు పద్ధతులను అన్వేషించాలని ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న ప్రముఖ శాస్త్రవేత్త, పద్మశ్రీ గ్రహీత శరద్ ఖలే, బయోడిగ్రేడబుల్ వ్యర్థాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి చేయడం పర్యావరణ అనుకూల పరిష్కారమని పేర్కొన్నారు. త్వరలో టీటీడీకి అనువైన ప్రణాళికను అందజేస్తానన్నారు. కూరగాయల వ్యర్థాలతో సేంద్రీయ ఎరువుల తయారీ విధానాన్ని ప్రదర్శించారు. సమీక్షలో టీటీడీ సీఈ సత్యనారాయణ, ఈఈ సుధాకర్, డిప్యూటీఈవో సోమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, శాస్త్రవేత్తలు సందీప్ అసోలేకర్, బౌ నిపుర్తే తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల వ్యర్థాలతో సేంద్రీయ ఎరువుల తయారీ ప్రకియను ప్రదర్శిస్తున్న శరద్ ఖలే



గంగమ్మ ఒడిలోకి గణనాథుడు

తూపిలిపాళెం తీరంలో భారీ ఏర్పాట్ల మధ్య నిమజ్జనోత్సవం

వాకాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భక్తుల తన్మయత్వం, యువత ఉత్సాహం, చిన్నారుల కేరింతల మధ్య శుక్రవారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో గణేష్ నిమజ్జనోత్సవం జరిగింది. నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి ట్రాక్టర్లు, మినీట్రక్కులు, ట్రాలీ ఆటోలు, లారీల ద్వారా వినాయక విగ్రహాలను తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలు, ఒక భారీ క్రేన్, బోట్లను, గజఈతగాళ్లను అధికారులు ఏర్పాటు చేశారు. గంగన్నపాళెం సర్పంచి మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు పరిశీలించారు. 115 మందితో బందోబస్తు చేపట్టినట్లు సీఐ హుస్సేన్‌బాబు తెలిపారు. లైట్‌హౌస్, తూపిలిపాళెం సముద్రతీరాలలో 224 గణపతి ప్రతిమలతో భక్తులు నిమజ్జనం చేశారు. వాకాడు, కోట చిట్టమూరు ఎస్‌ఐలు నాగబాబు, పవన్, బలరామయ్య, డీటీ రఫీ సయ్యద్, ఆర్‌ఐ అఖిల్ తదితరులున్నారు.

ఎస్వీయూ ఎల్‌ఎల్‌బీ పరీక్ష వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఒకటి వాయిదా పడింది. సెప్టెంబరు 5వ తేదీన ఎన్విరాన్‌మెంటల్ లా (వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్) పరీక్ష నిర్వహించాలని భావించారు. అయితే అదే రోజున మిలద్-ఉన్-నబీ పండుగ కారణంగా పబ్లిక్ హాలిడే ఉంది. ఇందువల్ల ఆ పరీక్షను సెప్టెంబరు 8వ తేదీ నాటికి వాయిదా వేశారు. ఈ మేరకు లా కాలేజీలు, పరీక్షా కేంద్రాలకు యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారిక ఉత్తర్వులు పంపిందని వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

జర్నలిస్టు అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో మరో మూడు నెలలు అంటే నవంబరు 30వ తేదీ వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ పూర్తయ్యే వరకు పొడిగిస్తూ సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.ఆగస్టు 31నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు మాత్రమే ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. సంబంధిత మీడియా సంస్థల యాజమాన్యాలు వారివారి సంస్థలో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో వీలైనంత త్వరగా అందజేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక వేనాడు దర్గా



● నేడు 30వ గంథోత్సవం.. ఏర్పాట్లు పూర్తి

సూళ్లూరుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం వేనాడులో 144 అడుగుల పొడవుతో ఉన్న దర్గా ఆసియాలోనే అతిపెద్దది. ఇక్కడి హజరత్ షేక్ దావూద్ షా వలీ అల్లా తాత దర్గా 30వ గంథోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ దర్గా గంథోత్సవానికి హిందూ, ముస్లింలు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. గంథోత్సవానికి మన రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. ఈ దర్గాలో జెండా స్థాపన నుంచి గంథోత్సవం రోజు గంధాన్ని లేపనం చేసే వరకు హిందూ మతానికి చెందిన గ్రామ పెద్దలే చేస్తారు. ముస్లిం మత పెద్దలచే బాబా సంకీర్తనలు ఉంటాయి. ఈ గంథోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వాహకులు రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. దర్గా సమాధి చుట్టూ రేకులు షెడ్ తొలిగించి చుట్టూ సిమెంట్ గోడల నిర్మాణం చేపట్టారు. రెండు వైపులా భక్తులు గంథోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద కిటికీలు ఏర్పాటు చేశారు. పైనా స్లాబ్‌వేసి వేశారు. దర్గా ప్రాంగణమంతా టైల్స్ వేశారు. జెండా స్థాపన వద్ద ప్రహరీ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. గంథోత్సవం సందర్భంగా దర్గా నుంచి గ్రామ పొలిమేర్ల వరకు విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. ఇక షార్ సర్కిల్, రైల్వే స్టేషన్ నుంచి వేనాడు దర్గా వరకు ఆర్టీసీ పది బస్సులను ప్రత్యేకంగా నడుపనుంది.

ఐఐటీలో ఎంటెక్ ప్రోగ్రామ్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

ఏర్పేడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో ఓ కొత్త అధ్యాయం మొదలయింది. దశాబ్దకాల ప్రస్థానంలో విశేష స్థానానికి చేరుకున్న ఈ ఉన్నత విద్యాసంస్థలో ఓ కొత్త కోర్సు ప్రారంభమైంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఎంటెక్ కోర్స్(అడ్వాన్స్‌డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీ) శుక్రవారం శ్రీకారం చుట్టుకుంది. పరిశ్రమల మద్దతుతో ఈ కోర్స్ నిర్వహించనున్నట్లు ఐఐటీ వర్గాలు తెలిపాయి. కోర్స్ ప్రారంభ కార్యక్రమంలో అధికారులతో పాటు వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు పాలుపంచుకున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఓరియంటేషన్ కార్యక్రమానికి డీన్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యం వహిస్తున్నారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ కొత్త బ్యాచ్ విద్యార్థులకు తమ విద్యాసంస్థ లక్ష్యం, విలువలు, సాధించిన విజయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జేఎస్ డబ్ల్యూ గ్రూప్ ఆపరేషన్స్ అధినేత అశ్విన్ బజాజ్, అమరరాజ ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ సీఈవో విజయానంద్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ యశోధన్ ప్రమోద్ గోఖలే తదితరులు పాల్గొని ప్రసంగించారు. 13మంది ఈ ఎంటెక్ ప్రోగ్రామ్‌లో చేరారు. ఇందులో అమరాజా, జేఎస్‌డబ్ల్యూ వంటి పరిశ్రమల నుంచి స్పాన్సర్‌షిప్ పొందిన 12మంది ఉద్యోగులు ఉన్నారు. డీన్ శశిధర్ గుమ్మ తొలిరోజు కార్యక్రమాన్ని ప్రారంభించగా డాక్టర్ సౌరవ్‌చక్రవర్తి ప్రసంగంతో ఓరియంటేషన్ ముగిసింది.



ఐఐటీ సమావేశానికి హాజరైన ప్రముఖులు

మా స్మార్ట్ రేషన్ కార్డు ఎక్కడుంది?

- సచివాలయాల చుట్టూ చక్కర్లు



స్మార్ట్ రేషన్ కార్డుల కోసం సచివాలయం వద్ద కార్డుదారులు

● నా పేరు స్రవంతి. మేము తిరుపతిలోని అశోక్‌నగర్‌లో ఉంటున్నాం. మా స్మార్టు రేషన్ కార్డు ఎక్కడ ఇస్తున్నారో తెలియక నాలుగు రోజులుగా జీవకోన, సత్యనారాయణ పురం, అశోక్‌నగర్, తుడా ఆఫీసు వద్ద వున్న సచివాలయాలకు వెళ్లి చూశాం. ఎవరిని అడిగినా సరైన సమాధానం లేదు. తీరా మా ప్రాంతానికి సంబంధంలేని ఓ వీఆర్వోను సంప్రదిస్తే జీవకోనలోని సచివాలయంలో ఉందన్నారు. అక్కడకు వెళ్లి అడిగినా సరైన సమాధానం లేదు. తీరా అదే జీవకోనలో పదో వార్డులో నా కార్డు ఉంది.

● నా పేరు మనోహరి. మాది బాలాజీ కాలనీ. ఇప్పటి వరకు మేము బాలాజీ కాలనీలోనే రేషన్ తీసుకుంటున్నాం. స్మార్టు కార్డు గురించి మా సచివాలయంలో వీఆర్వోని అడిగితే ఇక్కడకు రాలేదన్నారు. ఇంతకు ముందు ఎక్కడ కాపురమున్నారో అక్కడకు వెళ్లి తీసుకోండని చెప్పారు. అక్కడకు వెళితే మా కార్డు చింతలచేనులోని సచివాలయంలో ఉందన్నారు. అక్కడా నా కార్డు దొరకలేదు. ఇలా వారం రోజులుగా తిరిగినా.. ఇప్పటికీ దొరకలేదు.

.. ఇది స్రవంతి, మనోహరి సమస్యే కాదు. ఇలా ఎందరో స్మార్టు కార్డుల కోసం తిరుగుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా దాదాపు 5,91,259 పాత కార్డులున్నాయి. కొత్తగా మరో 44,937 స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం ఎగ్జిస్టింగ్ కార్డులకే స్మార్ట్ రేషన్ కార్డులను సంబంధిత వార్డు సచివాలయాల్లోని వీఆర్వోలు, వెల్ఫేర్ కార్యదర్శుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. అయితే, వైసీపీ ప్రభుత్వంలో చేసిన రేషన్ కార్డుల మ్యాపింగ్‌తో.. ఎవరి కార్డు ఎక్కడుందో తెలియక కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా స్మార్టు కార్డులను పంపిణీ చేస్తున్నా చాలా మందికి వారి కార్డు ఎక్కడుందో తెలియని పరిస్థితి. దీంతో సచివాలయాల వద్ద కార్డుదారులు గుంపులుగా చేరుతున్నారు. తమకు స్మార్టు రేషన్ కార్డు వచ్చిందా.. లేదా అంటూ అధికారులను అడుగుతున్నారు. కొందరు డీలర్ల వద్దకెళ్లి కీ రిజిస్టర్ పరిశీలించినా అక్కడ కూడా కొంత మంది కార్డులు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి కీ రిజిస్టర్ ఆధారంగా పంపిణీ చేస్తే కొంత వరకు సమస్య తగ్గుతుంది. దీనిపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజును 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా, వచ్చే నెల ఒకటో తేది నుంచి డీలర్లు స్మార్టు కార్డులను అందజేస్తారని అన్నారు. అంత వరకు ఓపిగ్గా ఉండాలని సూచించారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

స్రవంతికి గిడుగు జాతీయ పురస్కారం



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తిరుపతికి చెందిన ప్రముఖ సైకాలజిస్ట్, సాహితీవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ స్రవంతి ఐతరాజు గిడుగు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. సాహిత్యం, వ్యక్తిత్వ రంగాల్లో ఆమె ఎంపికయ్యారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి

తిరుచానూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో వెలసిన శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ దర్శించుకున్నారు.ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.



తిరుపతికి చేరిన త్రిసేనల బుద్ధ సర్క్యూట్ యాత్ర

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): త్రిసేనల లార్డ్ బుద్ధ సర్క్యూట్ మోటార్ సైకిల్ యాత్ర శుక్రవారం రాత్రి 9గంటలకు తిరుపతికి చేరింది. కలెక్టరేట్ వద్ద వారికి డీఆర్వో నరసింహులు, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ యాత్రలో భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన త్రిసేనల అధికారులు, అలాగే బిమ్‌స్టెక్ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. బుద్ధుడి శాశ్వత సందేశమైన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వంను దేశమంతటా వ్యాపించేటట్లు చేసే ప్రయత్నం జరుగుతోంది. బుద్ధ సర్క్యూట్ పేరిట సాంస్కృతిక, ఆధ్యాత్మిక మార్గాలను పునఃఅన్వేషించడానికి ఈ మోటార్ సైకిల్‌యాత్ర ఉపకరిస్తుందని కన్వీనర్ రాహుల్ పాటిల్ తెలిపారు. నేపాల్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర శ్రీలంక వరకు కొనసాగుతుందని పర్యాటక శాఖాధికారి జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ బృందంలోని సభ్యులు శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, ఆదివారం బయలుదేరతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి భరత్‌కుమార్‌రెడ్డి, సాంస్కృతిక శాఖ ప్రతినిధి మునికుమార్ పాల్గొన్నారు.





తిరుపతికి చేరుకున్న బుద్ధ త్రిసేనల సర్క్యూట్ యాత్ర - యాత్ర ప్రతినిధులతో డీఆర్వో నరసింహులు, పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి

పొలాల్లో ఏనుగుల గుంపు దాడి



పంట ధ్వంసం దృశ్యాలు



చంద్రగిరి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చిన్నరామాపురం గ్రామ సమీపంలో గురువారం అర్ధరాత్రి ఏనుగులు హల్‌చల్ చేశాయి. పంటపొలాలపై విరుచుకుపడ్డాయి. అర్ధరాత్రి దాటాక ఏనుగుల గుంపు గ్రామానికి చెందిన బొమ్మల మునిరత్నం, భారతికు చెందిన పొలంలో బీభత్సం చేశాయి. అక్కడ నుంచి సమీపంలోని పశువుల గడ్డి వామును నేలమట్టం చేశాయి. పంటలను తొక్కి నాశనం చేశాయని బాధిత రైతులు వాపోయారు. పొలాలకు వేసిన కంచెను సైతం ధ్వంసం చేసుకుంటూ చెరువు మార్గం ద్వారా అటవీప్రాంతంలోకి వెళ్లినట్లు వీరు చెబుతున్నారు. యేటా ఇదే రీతిలో పంట చేతికి అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారంతో పాటు ఏనుగుల కట్టడికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.82కోట్లు



శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి హుండీల ద్వారా రూ.1,82,17,085 వచ్చింది. ఆలయ ఆవరణంలోని కొట్టు మండపంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 58 గ్రాములు, వెండి 510.600 కేజీలు, విదేశీ కరెన్సీ 265నోట్లు వచ్చాయి. గత నెల 30వ తేదీ నుంచి ఈ హుండీ ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ పాలకమండలికి 42 దరఖాస్తులు

తిరుపతి, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి) : శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలకమండలిలో చోటుకోసం 42 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఈవో జయకుమార్ తెలిపారు. గంగమ్మ ఆలయ ట్రస్టుబోర్డు నియామకం కోసం దేవదాయ, ధర్మాదాయ శాఖ ఈనెల 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. 26వ తేదీలోపు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం ఉదయం 10గంటలకు ఆలయ ప్రాంగణంలో దరఖాస్తులను స్క్రూటినీ చేస్తున్నామని, దరఖాస్తుదారులు హాజరుకావాలని ఈవో కోరారు.

గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ జేఏసీ నాయకులు

గూడూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు కోరారు. శుక్రవారం ఉపాధ్యాయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నెల్లూరు జిల్లాలో ఉన్న గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపడంతో అక్కడికి వెళ్లాలంటే ఇటు ప్రజలు, అటు ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నూతన జిల్లాల ఏర్పాటు ప్రక్రియ చేపట్టిందన్నారు. అవసరమైన వనరులన్నీ ఉన్నందున ప్రభుత్వం గూడూరును జిల్లాకేంద్రంగా ప్రకటించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి గూడూరును జిల్లా చేసేందుకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రవి, మోహన్‌దాస్, రవిచంద్ర, ప్రవీణ్‌కుమార్, మురళీసింగ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హాకీ క్రీడాకారులు

గూడూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకుని నేటితరం క్రీడాకారులు ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని హాకీ క్రీడాకారులు అన్నారు. శుక్రవారం స్థానిక ఏఆర్‌డి ప్రభుత్వ స్టేడియంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం వద్ద హాకీ క్రీడాకారులు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ హాకీక్రీడలో ధ్యాన్‌చంద్ ప్రతిభనుచాటి దేశప్రతిష్టను ప్రపంచ స్థాయికి చాటారన్నారు. ఆయన జయంతిని కేంద్రప్రభుత్వం జాతీయ క్రీడాదినోత్సవంగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో హాకీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివప్రసాద్, నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: మండల పరిధిలోని గునపాడు ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపేటకు చెందిన జాతీయ పారా అథ్లెట్ మామిడి లక్ష్మయ్యను ఎంఈవో-2 భూపయ్య, ఉపాధ్యాయులు సన్మానించారు. నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్ ద్వారా రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు నగదు, సర్టిఫికెట్‌లను అందజేశారు. తెలుగు క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అదేవిధంగా కొత్తగుంట టీఎంఆర్ కళాశాలలో తెలుగు భాష కోసం పాటుపడిన శ్రీకృష్ణదేవరాయలు, పోతన, నన్నయ్య, తిక్కన, మా తెలుగు తల్లి వంటి మహోన్నతమైన వ్యక్తుల వేషధారణతో విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారుడు భరత్ మహిపతి, టీఎంఆర్ విద్యా సంస్థల అధినేత మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ రహంతుల్లా, గునపాడు ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు పెంచలయ్య, సీతారామయ్య, శివప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



గునపాడు ఉన్నత పాఠశాలలో జాతీయ జాతీయ పారా అథ్లెట్ మామిడి లక్ష్మయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి శంకర్ శర్మ నిర్వహించిన కార్యక్రమంలో అమ్మాజీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోట: కోటలోని బాలసదనంలో సీడీపీవో మునికుమారి ఆధ్వర్యంలో చిన్నారులకు క్రీడాపోటీలు ప్రారంభించారు. మూడ్రోజుల పాటు పోటీలు నిర్వహించిన అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆమె తెలిపారు.

విద్యార్థులకు గుడ్డసంచుల పంపిణీ



కోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీతారామ ధార్మికసేవాసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్డ సంచులు పంపిణీ చేశారు. వాకాడు మండలం బాలిరెడ్డిపాళెంలోని పట్టాభిరామ ఆలయం కేంద్రంగా సీతారామ ధార్మికసేవా సంస్థ నడుస్తోంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా హెచ్ఎం గిరిధర్‌బాబు, విశ్రాంత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అక్కడ ఉన్న 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఈ సంచులను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములై మొక్కలను పెంచి వాటికి ఊపిరిపోయాలని పిలుపునిచ్చారు. సంస్థ ప్రతినిధులు అనంతబాబు, సాయిబాబా, పరమేశ్వరి, కరీముల్లా, షౌకత్ ఆలీ, రాంబాబు, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఫీడ్ దుకాణం దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల వీధిలో శుక్రవారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్‌తో ఆక్వాఫీడ్ దుకాణం దగ్ధమైంది. ఇక్కడ రొయ్యల మేతలు, కెమికల్స్ దుకాణాన్ని స్థానికంగా ఉన్న శ్రీధర్‌రెడ్డి నడుపుతున్నారు. తెల్లవారుజాము సమయంలో దుకాణంలోని విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్‌కు గురై మంటలు ఎగిశాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా అప్పటికే లక్షలాది రూపాయలు విలువచేసే రొయ్యల మేతలు, కెమికల్స్ మోటార్లు కాలి దగ్ధమయ్యాయి.

రోగులకు రొట్టెలు, పండ్ల పంపిణీ

గూడూరు అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం మానవత సేవాసంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సేవాసంస్థ ఆధ్వర్యంలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు మాట్లాడుతూ తమ సేవాసంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షరీనా, దశరధరామిరెడ్డి, బాలకృష్ణంరాజు, రమణారెడ్డి, సురేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

స్పేర్‌పార్ట్స్ దుకాణంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నాయుడుపేట టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వే స్టేషన్‌కు ఎదురుగా ఉన్న స్పేర్‌పార్ట్స్ దుకాణంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం సాయంత్రం యజమాని తన సొంత పనుల నిమిత్తం దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. కొంత సమయం తరువాత షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పొగ అలుముకోవడంతో సమీపంలో ఉన్న దుకాణదారులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపుచేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న రూ.7 లక్షలు విలువచేసే సామాగ్రి దగ్ధమైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

సంగమేశ్వర ఆలయానికి సింహ వాహనం బహూకరణ



కోట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షి దేవి సమేత సంగమేశ్వర స్వామివారి ఆలయానికి శుక్రవారం విద్యానగర్‌కు చెందిన స్వర్గీయ పృథ్వీసుందరయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య సుదర్శనమ్మ, కుమారుడు సురేష్‌బాబు, అన్నపూర్ణమ్మ దంపతుల వితరణతో నూతన పంచలోహ సింహ వాహనాన్ని బహూకరించారు. ఆ వాహనాన్ని ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామికి అందజేశారు.

ఒడిశా గవర్నరును కలిసిన టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు



హరిబాబును కలిసిన మాధవనాయుడు, పక్కన ఎంపీ అప్పలనాయుడు

దక్కిలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఒడిశా గవర్నర్ హరిబాబును శుక్రవారం టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు వెంపటి మాధవనాయుడు, విజయనగరం ఎంపీ అప్పలనాయుడులు రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భం గా మాధవనాయుడు మీడియాతో మాట్లాడారు. ఒడిశా ప్రభుత్వంతో కొన్ని తెలుగు సంఘాల సమస్యల గురించి చర్చించినట్లు వివరించారు. ఒడిశాలో ఉండే తెలుగు వారి పరిస్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని హరిబాబుకి విజ్ఞప్తి చేశామన్నారు.

నాయుడుపేట ఏఎంసీ పాలకవర్గం ఎంపిక

నాయుడుపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని శుక్రవారం ప్రభుత్వం ప్రకటించింది. నాయుడుపేట ఏఎంసీ గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, అధ్యక్షుడిగా ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కిలారి గోపీ, సభ్యులుగా కాటూరి కోటేశ్వరరావు, కూచివాడ పవిత్రారెడ్డి, తుపాకుల కన్నెమ్మ, సీహెచ్ సుజాత, కామిరెడ్డి కేశవరెడ్డి, సీహెచ్ వేణయ్య, గోను బాబు, రాపూరు కస్తూరమ్మ, పాలూరు భాస్కర్, బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, కొండూరు సౌమ్య, గెంజి సుధాకర్, గెంజి సతీష్‌కుమార్‌లతో పాటు ఓజిలి పీఏసీఎస్ అధ్యక్షుడు, అగ్రికల్చర్ ఏడీఏ నాయుడుపేట, పెళ్లకూరు మండలం కొత్తూరు సర్పంచ్, జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్‌లను ఎంపిక చేశారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వాకాటి

సూళ్లూరుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సూళ్లూరుపేటకు చెందిన మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి నియమితులయ్యారు. గతంలో వాకాటి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు.

అమ్మవారిపేట మాజీ ఉపసర్పంచ్ కన్నుమూత

వెంకటగిరి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బీసీ నేత అమ్మవారిపేట మాజీ ఉపసర్పంచ్ ఆవుల ఓబయ్య (80) శుక్రవారం రాత్రి కన్నుమూశారు. ఓబయ్య గతంలో అమ్మవారిపేట పంచాయితీ ఉప సర్పంచ్‌గా, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉండేవారు. అనంతరం టీడీపీలో చేరి 2014 ఎన్నికల్లో కురుగొండ్ల రామకృష్ణ గెలుపుకోసం కృషిచేశారు. ఓబయ్య అంత్యక్రియలు శనివారం జరుగుతాయని కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నెల్లటూరు విద్యార్థి ఎంపిక



వెంకట్‌కార్తీక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయురాళ్లు

గూడూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు నెల్లటూరు హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి వెంకట్‌కార్తీక్ ఎంపికయ్యాడని హెచ్ఎం పార్వతి అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన వెంకట్‌కార్తీక్ ఇటీవల నెల్లూరులో జరిగిన జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు ఒంగోలు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. వెంకట్‌కార్తీక్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

అంత్యక్రియలకు బలిజ సంఘం చేయూత



నాయుడుపేట టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట అమరాగార్డెన్‌లో నివసించే నిరుపేద కుటుంబానికి చెందిన ఇందుకూరు హంసమ్మ మృతి చెందారు. ఆమె అంత్యక్రియల కోసం శుక్రవారం నాయుడుపేట బలిజ సంఘ అధ్యక్షుడు పగడాల శివప్రదీప్, కార్యదర్శి హంసాపృథ్వీచంద్‌లు రూ.11వేలు అందజేశారు.

వైభవంగా చెంచుమహాలక్ష్మి వేడుకలు

పెళ్లకూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు, జీలపాటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామీ సమేత చెంచుమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం వేడుకలను వైభవంగా నిర్వహించారు. చందనా అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కోలాట భజనల నడుమ స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ఆలయ పురోహితులు ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.







నాయుడుపేటలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు - పాతనాలపాడులో గణేష్ ఉత్సవాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ - చిల్లకూరులో ఉట్టి కొడుతున్న యువకుడు

ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు

- పాతనాలపాడులో ఉట్టికొట్టే ప్రక్రియను తిలకించిన ఎమ్మెల్యే కురుగొండ్ల

దక్కిలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): దక్కిలి మండలంలో శుక్రవారం వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేదికలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వగ్రామమైన పాతనాలపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యువత ఉట్టికొట్టే కార్యక్రమాన్ని వీక్షించారు. మండలంలోని కమ్మపల్లిలో యువత కేరింతల నడుమ గణనాథుడి ఊరేగింపు జరిగింది. అనంతరం స్వామి వారి ప్రతిమను తెలుగుగంగ కాలువలో నిమజ్జనం చేశారు. డక్కిలిలో పేదలకు ఉభయ దాతలు అన్నదానం నిర్వహించారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నాయుడుపేట: నాయుడుపేట పట్టణ, మండలంలోని కొన్ని వినాయక విగ్రహాలను మేళతాళాలతో, యువత నృత్యాలతో రంగులు చల్లుకుంటూ నిమజ్జనానికి తరలించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉట్టి మహోత్సవాల్లో యువత, చిన్నారులు పాల్గొని ఉత్సాహంగా ఉట్టిని కొట్టారు.

చిల్లకూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ఉట్టి, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక గొల్లపాళెం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద చిన్నారులు, యువకులు చిందులు వేస్తూ ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వెంకటగిరిటౌన్: పట్టణంలోని ఆనందపురం, మల్లమ్మగుడి వీధి, ఎన్టీఆర్ కాలనీ, బీసీ కాలనీ, బంగారుపేట తదితర ప్రాంతాల్లో వినాయక చవితి సంబరాలు శుక్రవారం జరుపుకున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా ఉట్టి కొట్టి, రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. అన్నదానం నిర్వహించి, వినాయక ప్రతిమను రాపూరు రోడ్డులోని తెలుగుగంగ కాలువలో నిమజ్జనం చేశారు.

బాలాయపల్లి: మండల పరిధిలోని సుబ్రమణ్యం, కడగుండ గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉట్టికొట్టి సంబరాలు జరుపుకుని, అన్నదానం చేశారు.

కోట: మండల పరిధిలోని కోట, విద్యానగర్, ఉచ్చూరివారిపాళెంలతో పాటు పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గణనాథుల గ్రామోత్సవం జరిగింది. ప్రకాశంకాలనీ, చెందోడు, కోట క్రాస్‌రోడ్లలోని గణనాథుల విగ్రహాలను మేళతాళాలమధ్య యువత కేరింతలు కొడుతూ శ్రీనివాససత్రం, తూపిలిపాళెం సముద్రాలలో నిమజ్జనానికి తరలించారు.

నెర్రి కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే



నెర్రి కాలువ పనులను ఎమ్మెల్యే విజయశ్రీకి వివరిస్తున్న ఏఈఈ రమేష్, పక్కనే టీడీపీ నేత మాధవనాయుడు తదితరులు

సూళ్లూరుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరందించే నెర్రి కాలువను శుక్రవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. గత ఏడాది వరదలకు నెర్రి కాలువ పొర్లుకట్టలు దెబ్బతిని కోతకు గురైన విషయం తెలిసిందే. దీంతో వాటంబేడు, గోపాల్‌రెడ్డిపాలెం, పాములమిట్ట, కారిజాత గ్రామస్తులు నెర్రి కాలువ గండ్లను త్వరితగతిన పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఇందుకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జీఎన్‌టీ రోడ్డులో ఉన్న లూథరన్ చర్చి వెనకాల గండ్లు పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. నెర్రి కాలువ పొర్లుకట్టకు రక్షణగా నిర్మిస్తున్న వాల్‌ను పరిశీలించి, ఇరిగేషన్ డీఈ కస్తూరయ్య, ఏఈ రమేష్‌లను వివరాలడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నెర్రి కాలువ గండ్లను పూడ్చి సాగునీరందిస్తామని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవ నాయుడు, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, ఏలిమేటి సతీష్, బొమ్మన్ పళణి, బొమ్మన్ శ్రీధర్, మునీంద్రయ్య, రైతులు భాస్కర్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం





తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు - ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విజేతలను అభినందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తదితరులు

గూడూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాష వ్యాప్తికి గిడుగు వెంకటరామమూర్తి ఎనలేని కృషిచేశారని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించి, విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషకు రామమూర్తి ప్రాణం పోశారన్నారు. కార్యక్రమంలో హరిబాబు, హరిబ్రహ్మ, బాషా, వినయ్‌కుమార్, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మినర్వా పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివప్రసాద్, ఝాన్సీరాణి, శ్రీధర్, నారాయణరాజు, డాక్టర్ పీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శర్మ ఆధ్వర్యంలో అధ్యాపకులు గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అధ్యాపకులు వి.రాజా, సుబ్రమణ్యం, అమ్మాజీ పాల్గొన్నారు.
- కోట: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. శోభారాణి, మల్లికార్జునరెడ్డి, రామ్‌కుమార్, రామభాగ్య తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. ఎన్‌సీసీ ఆఫీసర్ పి.శ్రీనివాసులు, కోఆర్డినేటర్ రాజేష్, ప్రసాద్, గాదె శ్రీనివాస్, డాక్టర్ వల్లీదేవి పాల్గొన్నారు.
- చిల్లకూరు: పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గిడుగు రామమూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు. హెచ్ఎం అనసూయ, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, చంద్రశేఖర్, లావణ్య, శ్రీనివాసులు, రవీంద్ర, సంధ్యారాణి, మధుసూదన్‌రావు, విద్యుల్లత, సుగుణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షార్ ఉద్యోగుల కాలనీకి వెళ్లే పైపులైన్ లీకేజీ



సాయినగర్‌లో లీకేజి అవుతున్న పైపులైన్

సూళ్లూరుపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కాళంగి నది నుంచి షార్ ఉద్యోగుల కాలనీకి ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్‌లో సాయినగర్ నెర్రికాలువ అంచున పైపు పగిలి తాగునీరంతా లీకేజీ కావడంతో ఆ ప్రాంతంలోని నివాసాల నడుమ రోడ్లపైకి చేరి జలమయంగా మారింది. శుక్రవారం స్థానికులు గుర్తించి మున్సిపాలిటీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని పరిశీలించి, అది షార్ ఉద్యోగుల కాలనీకి వెళ్లే పైపులైన్‌గా గుర్తించి వెంటనే షార్ అధికారులకు సమాచారం ఇచ్చారు. షార్ నీటి విభాగం వారు సాయంత్రం అక్కడకు చేరుకుని పైపులైన్‌కు మరమ్మతులు చేశారు.

కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

గూడూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక టవర్‌క్లాక్ వద్ద శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ఎలక్షన్ కమిషన్‌ను తన అధికార బలంతో ఉపయోగించుకుని కీలుబొమ్మలా మార్చివేసిందన్నారు. ఒకే చిరునామాతో వందల కొద్దీ ఓటర్లు ఉండడం, ఒకే వ్యక్తికి మూడు, నాలుగు రాష్ట్రాల్లో ఓటు ఉండడం వంటి అనేక పొరపాట్లు చోటు చేసుకున్నా పట్టించుకోలేదన్నారు. ఒక వ్యక్తి ఒకే ఓటు ఉండేలా ఆధార్‌కార్డుతో అనుసంధానం చేయాలన్నారు. కార్యక్రమంలో పూల చంద్రశేఖర్, రామకృష్ణ, సుబ్బరామరాజు, చిరంజీవి, కరిముల్లా, బ్రహ్మయ్య, వేమయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

గూడూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అక్రమంగా సస్పెండ్ చేసిన కండక్టర్ శ్రావణ్‌కుమార్‌ను విధుల్లోకి వెంటనే తీసుకోవాలన్నారు. డిపో మేనేజర్ తన వైఖరిని మార్చుకోవాలన్నారు. ఇప్పటికే పలుమార్లు ఈ విషయమై ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి డిపోలో సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అహ్మద్, ప్రవీణ్, బాషా, శ్రీనివాసులు, కృష్ణ, గౌస్, సందానీ, పోలయ్య, కమలాకర్, బాబురావు, రమేష్, సుధాకర్, శివ తదితరులు పాల్గొన్నారు.



రిలేనిరాహార దీక్షలు నిర్వహిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

నిమజ్జనానికి ఏర్పాట్లు

గూడూరు అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను స్థానిక పంబలేరులో నిమజ్జనం చేసే సందర్భంలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేశామని రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జాతీయరహదారిలో పంబలేరు వంతెన వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ, సమీప ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు వినాయక ప్రతిమలను పంబలేరు బ్రిడ్జిపై నుంచి వాగులోకి నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.